సూర్య

www.suryaa.com

1.2.2026


ఆదివారం అనుబంధం




# అమోఘం
# మాఘపున్నం



# చైర్మన్‌తో ముఖాముఖి



**2027 ఆర్థిక సంవత్సరానికి హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్ షెడ్యూల్‌ను విడుదలైన్టు సమాచారం వస్తోంది.. హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ ఏడాది మార్చి 4 నుంచి ప్రారంభించనున్నట్టు పలు మీడియా సంస్థలలో వస్తున్న కథనాలు చెపుతున్న మాట మీరు ఇందుకు సంబంధించిన వివరాలు చెప్పగలరా?**

**జి. మహేశ్వర్, హైదరాబాద్**

మీరు విన్నది నిజమే మహేశ్వర్ గారూ... వివరాల మేరకు.. ఇటీవలే అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాల విషయంలో కీలక ప్రకటన చేసింది. హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తుల ప్రక్రియ మార్చి నాలుగో తేదీన మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 19వ తేదీ మధ్యాహ్నం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం కల్పించినట్టు ప్రకటించింది. కాగా ఈ లాటరీలో మెరిట్, అధిక వేతనం ఉన్న వారికి టాప్ ప్రయారిటీ ఇవ్వనున్నారని నిపుణులు చెపుతున్న మాట. ప్రధానంగా నైపుణ్యం ఆధారిత వెయిటెడ్ సెలక్షన్ పద్ధతిని ట్రంప్ సర్కార్ అమలు చేయనుంది. ఇదే సమయంలో మల్టిపుల్ రిజిస్ట్రేషన్ల మోసాలకు యూఎస్‌సీఐఎస్ చెక్ పెట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. మార్చి 31, 2026 నాటికి ఎంపికైన వారి వివరాలను వెల్లడించనున్నారు. ఈ లాటరీ ద్వారా ఎంపికైనవారు 2027 వీసా కింద అక్టోబర్ 1 నుంచి అమెరికాలో పని చేయవచ్చు. ప్రస్తుతం చాలా మంది భారతీయ ఇంజినీర్లు, ఐటీ ప్రొఫెషనల్స్ వీసా లాటరీ కోసం ఎదురుచూస్తున్నారు.ఇదిలా ఉండగా.. హెచ్-1బీ వీసాల విషయంలో ట్రంప్ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. వీసా లాటరీ విధానంలో ఒకే వ్యక్తికి ఒకే యజమాని ద్వారా ఒక్క రిజిస్ట్రేషన్ మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఒకే యజమాని ఒక ఉద్యోగి పేరుతో అనేక రిజిస్ట్రేషన్లు చేస్తే అవన్నీ రద్దు చేస్తారు. కాగా మొత్తం -1 వీసాలు 85,000 మాత్రమే ఉండగా.. ఇందులో 65,000 వీసాలు సాధారణ కేటగిరీకి, మరో 20,000 వీసాలు అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన వారికి కేటాయించారు. ఈ వీసాకు అర్హులైనవారు బ్యాచిలర్ డిగ్రీ లేదా దానికి సమానమైన అర్హత కలిగి ఉండాలి. అలాగే అమెరికాలో స్పెషలైజ్డ్ జాబ్ ఆఫర్ ఉండాలి. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఉద్యోగి కాకుండా ఉద్యోగం ఇచ్చే కంపెనీ లేదా యజమాని చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఫీజు కేవలం 10 డాలర్లు మాత్రమే అయినా.. లాటరీలో సెలెక్ట్ అయితే వీసా ఫీజులు, ఇతర ఖర్చులు ఎక్కువగా ఉంటాయి.

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు దిశగా ఏర్పాట్లు ఆరంభించినట్టు సమాచారం అందుతోంది. ఏవియేషన్ పై ఆసక్తి ఉన్న నాటాంటి యువతకు ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నాఇందుకు సంబంధించిన వివరాలు చెప్పండి సార్.**

**- పి. పంకజ్ రాణి, విశాఖపట్నం**

అవును రాణిగారూ. ఏపి భవిష్య నిర్మాణంలో వడివడిగా అడులు వేస్తున్నట్టే కనిపిస్తోంది. ఐటీ కంపెనీలు, పరిశ్రమలు మాత్రమే కాదు కేంద్రం సహకారంతో విద్యా సంస్థలు, యూనివర్శిటీలను రాష్ట్రంలో ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఈక్రమంలోనే తాజాగా మరో సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చి, కేంద్రం ముందు ఉంచిం ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు దిశగా కసరత్తు పూర్తి చేసింది. దేశంలోనే మొదటి ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్ ఎడ్యుకేషన్ సిటీ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో పాల్గొన్న గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు గారు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు గారు, మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేలు .పాల్గొన్నారు. హస్తినలో జీఎంఆర్ సంస్థకు చెందిన ప్రతినిధులతో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ప్రతిపాదనలపై చర్చించడం క్షణాలలో తన సొంత ప్రాంతానికి ఎయిర్ పోర్‌ఉలో పాటు ఈ ఎడ్యుకేషన్ హబ్‌లో భాడస్వామ్యం అయ్యేలా సుముఖత వ్యక్తం చేయటం జరిగింది జిఎంరావు. ఈ మేరకు ప్రస్తుతం విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం పనులు ముగింపు దశకు వచ్చాయి. ఈ ఎయిర్‌పోర్ట్‌కు సమీపంగా ఉండే విశాఖపట్నం జిల్లా భీమిలి మండలంలోని అన్నవరం దగ్గర ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీకు భూములు అనువుగా ఉన్నాయని గుర్తించడం. వాటివ గురించి ఇక్కడ మాన్సాస్ ట్రస్ట్ ను సంప్రదించడం, వారు అంగీకరించడం జరిగింది. దీంతో అందుబాటులో ఉన్న ఇక్కడి ప్రభుత్వ, ప్రైవేట్ భూములు కలుపుకుని మొత్తం 500 ఎకరాల్లో ఈ సిటీని ఏర్పాటు కు రంగం సిద్దం చేసారు. . ఈ ప్రాజెక్టులో జీఎంఆర్‌తో కలిసి ఒప్పందం చేసుకున్నావిషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ వస్తే విమానయానం, ఏరోస్పేస్, రక్షణ రంగాలలో విద్య, శిక్షణకు దేశంలోనే ఒక ప్రధాన కేంద్రంగా మారుతుంది. గతంలోనే కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఈ ప్రతిపాదనను తీసుకొచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పక్కన విమానయాన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పుడు ఏవియేషన్ సిటీ దిశగా అడుగులు పడుతున్నాయి. ఎందుకంటే విశాఖపట్నం జిల్లా భీమిలి నుంచి భోగాపురం దగ్గరగా కూడా ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదన వాస్తవరూపం దాల్చితే ఇది విమానయాన రంగంలో ఒక విప్లవాత్మక మార్పును తీసుకువస్తుంది అంటున్నారు.

**నూకారపు సూర్య ప్రకాశరావు**
**చైర్మన్, సూర్య తెలుగుదినపత్రిక**

# సమాజ మార్పు కోసం పాటను ఆయుధంగా మలిచిన గద్దర్

## లెజెండ్



గుమ్మడి విఠల్‌రావు గా జన్మించి, గద్దర్గా ప్రసిద్ధి చెందిన విప్లవ కవిగాయకుడు తెలుగు సాంస్కృతిక, రాజకీయ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. 1949 జనవరి 31న అప్పటి మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలో ఒక పేద దళిత కుటుంబంలో జన్మించిన గద్దర్, తన జీవితాన్ని ప్రజల పాటగా, పోరాట స్వరంగా మలిచాడు. 2023 ఆగస్టు 6న గుండె శస్త్రచికిత్స అనంతర ఆరోగ్య సమస్యలతో ఆయన మరణించినప్పటికీ, పీడిత వర్గాల స్వరంగా ఆయన వారసత్వం ఇంకా జీవించేస్తోంది. పంజాబ్‌కు చెందిన చారిత్రక గదర్ పార్టీకి గౌరవంగా తన పేరును "గద్దర్"గా మార్చుకున్న విఠల్‌రావు, జానపద కళను రాజకీయ చైతన్యానికి ఆయుధంగా మార్చాడు. ఆయన నేతృత్వంలోని జన నాట్య మండలి ద్వారా, వర్గపోరాటం, దోపిడి, ప్రతిఘటన వంటి భావాలను గ్రామాలు, పొలాలు, కార్మిక కాలనీల్లోకి తీసుకెళ్లాడు. పేదరికం నుంచి ప్రజల ప్రతీకగాప్రతిభావంతుడైన విద్యార్థిగా ఉన్న గద్దర్, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంజినీరింగ్ చదువును మధ్యలోనే వదిలేయాల్సి వచ్చింది. చిన్నప్పటి నుంచి దేశభక్తి, సమసమాజం మెండుగా ఉన్న గద్దర్ తొలినాళ్లలో గాంధీ బాట అనుసరణీయం అని భావించి బుర్రకథ కళారూపం తో ప్రభుత్వ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాచిగూడ సమీపంలో చాపెల్ బజార్ దగ్గర గుమ్మడి రామస్వామి నేతృత్వంలో బాపూజీ బుర్రకథ పార్టీ ఏర్పాటు చేశారు. అక్కడ కళాకారులకు బుర్రకథ, ఒగ్గు కథ, నాటికలు డోలక్, తబలా,డప్పు, కంజర తదితర వాయిద్యాలపై శిక్షణ ఇస్తూ ఎందరో కళాకారులను ఆదరించేవారు. సరస్వతమ్మ, విమలమ్మ పనిచేసేవారు. 1975లో విమలమ్మతో గద్దర్ వివాహం జరిగింది. కుటుంబ నియం త్రణ, అల్లూరి సీతారామరాజు వంటి జాతీయ నాయకులపై, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసే పనిలో ప్రదర్శనలు ఇచ్చారు. సమాచార ప్రచార శాఖ వారు నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని అక్కడ వచ్చే పారితోషికంతో జీవితం సాగింది. కొంతకాలం రసాయన కర్మాగారంలో కూలీగా కూడా పనిచేశాడు ఈ అనుభవాలు ఆయనను కార్మిక జీవనానికి మరింత దగ్గర చేశాయి. 1970ల ప్రారంభంలో బి. నర్సింగరావు నేతృత్వంలోని ఆర్ట్ లవర్స్ అసోసియేషన్తో పరిచయం ఆయన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసింది. అదే సంఘం గద్దర్ చొరవతో జన నాట్య మండలి గా రూపాంతరం చెందింది. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గదర్ పార్టీ సంప్రదాయాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన తన పేరు గద్దర్‌గా మార్చుకున్నాడు. బి నరసింగరావు ప్రోద్బలంతో రంగుల కల, దాసి, మా భూమి సినిమాల్లో పాటలు రాశారు. ఒరేయ్ రిక్షా జైబోలో తెలంగాణ సినిమాలకు ప్రతిష్టాత్మక నంది అవార్డు వచ్చినా తృణప్రాయంగా తిరస్కరించారు. **జానపద కళల రాజకీయీకరణ :** గద్దర్ ప్రత్యేకత జానపద కళలకు రాజకీయ చైతన్యాన్ని జోడించడంలో కనిపిస్తుంది. రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు, మహిళలు, కార్మికుల జీవన అనుభవాల నుంచే ఆయన పాటలు పుట్టాయి. బుర్రకథ, ఒగ్గుకథ, జముకుల కథ వంటి సంప్రదాయ కళారూపాలను సంస్కరించి, వాటిలో విప్లవ భావజాలాన్ని నింపాడు. సాధారణ భాష, గ్రామీణ స్వరం, ఉత్సాహభరితమైన నృత్యంతో గద్దర్, "కార్మిక వర్గం", "బూర్జువా రాజ్యం", "విప్లవం" వంటి క్లిష్టమైన సిద్ధాంతాలను ప్రజలకు అర్థమయ్యేలా చేశారు. "భారత దేశం భాగ్యసీమరా" పాట దేశ సంపదప్రజల పేదరికం మధ్య విరోధాన్ని చూపితే, "ఊరు మనదిరా" పాట శ్రమజీవుల స్వం తత్వాన్ని ప్రకటించింది.కారంచేడు, చుండూ రు వంటి దళిత మారణకాండకు స్పందనగా, మహిళా సమస్యలు, రైతు ఆత్మహత్యలు, గ్లోబలైజేషన్ దుష్ప్రభా వాలు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వంటి అంశా లపై ఆయన మూడు వేలకు పైగా పాటలు రచించారు.

**సాంస్కృతిక ఆధిపత్యాన్ని సవాల్ :** ముద్రిత మాధ్యమాలకు దూరంగా ఉన్న అణగారిన వర్గాలకు గద్దర్ తన పాటల ద్వారా స్వరం ఇచ్చారు. డప్పు, ఢోలక్ వంటి ప్రజల వాయిద్యాలతో, సినిమాలుఎలక్ట్రానిక్ మీడియా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా ప్రజల జ్ఞాపకాలను, అనుభవాలను వేదికపైకి తీసుకొచ్చాడు. తన కళా తత్వాన్ని ఆయన మూడు సూత్రాల్లో వివరించారు: ప్రజల భాణి, ప్రజల పలుకుబడి, ప్రజల జీవితం. వొంటిపై చొక్కా లేకుండా నల్లటి గొంగడి, గోచి కట్టు పంచ,, కాళ్లకు గజ్జెలు, ఎర్ర కర్చీఫ్‌తో ఆయన వేదికపై కనిపించేవాడు. ఆ ఎర్ర కర్చీఫ్ ఒక్కో సందర్భంలో తల్లి ప్రేమగా, విప్లవ పతాకంగా, అమ-రవీరుడి గుర్తుగా మారింది.

**విస్తృత ప్రగతిశీల సంప్రదాయంలో గద్దర్ :** గద్దర్‌ను జన నాట్య మండలిని, తెలుగు ప్రగతిశీల సాంస్కృతిక చరిత్రను విడదీయలేం. 1943లో ఏర్పడిన అభ్యుదయ రచయితల సంఘం, 194651 తెలంగాణ సాయుధ రైతాంగ పోరా టం, 1967 నక్సల్బరీ ఉద్యమం ఇవన్నీ సాహిత్యం, కళలు ప్రజా పోరాటాలకు అనుసంధానించారు. విప్లవ రచయితల సంఘం (విరసం) సాహిత్య రంగంలో కీలక పాత్ర పోషించారు, అది మేధావులకే పరిమితమైందని భావించి. ఆ లోటును పూరిస్తూ, జేఎన్‌ఎం ద్వారా గద్దర్ విప్లవ భావజాలాన్ని నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. అణగారిన వర్గాల నుంచి అనేక కళాకారులు వెలికి తీసి, శిక్షణ ఇచ్చారు. ఎందరో కళాకారులకు బాసటగా నిలిచారు.

**శాశ్వతమైన వారసత్వం :** "ప్రజల నుంచి ప్రజలకే" అనే విప్లవ సూత్రాన్ని గద్దర్ తన జీవితంలో ఆచరించాడు. జానపద కళలను రాజకీయీకరించి, ప్రజల జీవితాలతో మమేకం చేసిన ఆయన, సంస్కృతి కూడా సామాజిక మార్పుకు శక్తివంతమైన ఆయుధమేనని నిరూపించాడు. తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన గద్దర్ చివరి రోజుల్లో సామాజిక సమగ్రత కోసం మెరుగైన పౌర సమాజం కోసం కాంగ్రెస్ పార్టీకి చేరువయ్యారు. ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీతో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సభలలో పాల్గొన్నారు. తన గద్దర్ ఇక లేరు. కానీ ఆయన పాటలు, ఆయన స్వరం, ఆయన పోరాట స్ఫూర్తి ఇంకా ప్రజల మధ్యే నడుస్తూనే ఉన్నాయి.

**డా. వెన్నెల గద్దర్, చైర్ పర్సన్,**
**తెలంగాణ సాంస్కృతిక సారథి.**

## పాఠకుల లేఖలు




### ముఖచిత్ర కథనం

మన చేనేత కళాకారుల ప్రతిభకు అగ్గిపెట్టెలో పట్టే చీర ఓ నిదర్శనం. ఇలాంటి విశేషాలను అడపాదడపా ఆదివారం అనుబంధంలో ప్రచురించడంలో పాటు భవిష్యతరాలకు మన సంస్కృతి సంప్రదాయాలను తెలిపేలా పెద్ద పీట వేస్తున్న ఆదివారం అనుబంధ కథనంగా ప్రచురించడం బాగుంది. ప్రచురణ కర్తలకు, విశ్లేషణఝుతో కథనాన్ని అందించిన రచయి-ంతకు , సంపాదక వర్గానికి ధన్యవాదాలుసందర్భానుసారంగా మీ కథనాలు బాగున్నాయి. ఇదే పంథా కొనసాగించండి.

**- ఎలకల రవికుమార్, విశాఖపట్నం**

**రావు పల్లి రమేష్, విజయనగరం**

**చిత్తరంజన్ దాస్ వెలగపూడి, విశాఖపట్నం**

### సినిమా రివ్యూలు

వారం వారం విడుదలవుతున్న సినిమాలపై మీ విశ్లేషణ బాగుంది. ధన్యవాదా లు. ఓటిటి సినిమాలపై కూడా విశ్లేషణ చేయటం హర్షణీయం.

**-కస్తూరి శివరావు, విజయవాడ**

**-చినవీరభద్రుడు కణపాక, హైదరాబాద్**

### బుడత బాగున్నాడు

చిన్నారి ప్రపంచంలా ప్రచురిత మవుతున్న బుడత పేజీలో చిన్నారులకు వుపయుక్తంగా రచయితలు రాస్తున్న కథలు బాగున్నాయి. అలాగే పజిల్స్ విజ్ఞాన వంతంగా ఉన్నాయి. తెలుగువారి శతకాలు, పద్యాలు అప్పుడప్పుడు మిస్ అవుతున్నాం. తప్పక ప్రచురించండి

## సాహిత్యం

### నాలోని నీకై



నువ్వంపిన లేఖ
చివరన ఉన్న నీ చిరు సంతకం...

నా చేతికి
చెమ్మ అద్దుతోంది...

అక్షరాల అలికిడి
నీ గుండె సవ్వడై గిలిగింత
లెడుతోంది...

నిను తాకిన చిరుగాలి తరగ
నా గాజుల గలగల లై వినిపిస్తోంది...

నీ చిలిపి వీక్షణలు
నా మువ్వల రవమై కదులుతోంది...

నీ ప్రతిబింబమే
నా చిరునవ్వు దీపకళికై నిలిచేదాక...

నా నిరంతర నిరీక్షణ...
నాలోని నీకై ఈ అంతులేని అన్వేషణ...

**- శుభామహి నూచెర్ల**
**8790634454**

### వేటూరి పాటలు...!

వేటూరి..

తెలుగు పాటకు దస్తూరి
తెలుగు వధూటికి దిద్దిన నవ కస్తూరి
సినిమా పాటలకు వేసెను కొత్త దారి
అందరినీ అలరించిన పండిత సూరి..!
అమ్మ తోడులా ఆత్మీయత పాటలు
తోడు నీడలా కదిలే తొలకరి పాటలు
తీయని దెబ్బలా తియ్యనైన పాటలు
ఎలదేటి రొదలా ఎదమీటిన పాటలు..!
వీణ వేణువైన సరిగమలు గల పాటలు
అచ్చతెలుగులో అచ్చుగుద్దిన పాటలు
వేటూరి పాటలు పల్లె పడుచు పైటలు..!
వేటూరి పదాలు సిరివెన్నెల పదాలు
వేటూరి పదాలు సిరిసిరి మువ్వలు
వేటూరి పదాలు అచ్చ జానపదాలు
వేటూరి పదాలు వేవేల జ్ఞాన పదాలు
వేటూరి పాటలు హంస ధ్వని రాగాలు
వేటూరి పాటలు కదన కుతూహల
రాగాలు!
వేటూరి పాటలు పదహారేళ్ల వయసు
వేటూరి పాటలు సిరిమల్లెల మనసు
వేటూరి పాటలు కృష్ణానదీ తరంగాలు
వేటూరి పాటలు జీవన సంధ్యా రాగాలు
వేటూరి పాటలు శ్రావణ కారుణ్య
మేఘాలు..!
వేటూరి పాటలు తెలుగు జాతీయాలు
ేటూరి పాటలు శ్రీ వారికి శుభలేఖలు
వేటూరి పాటలు వేనవేల గీతాంజలిలు
వేటూరి పాటలు భువనాన వేణువులు
వేటూరి పాటలు శంకరునికి ప్రాణాలు



వేటూరి పాటలు అచ్చ తెనుగు తేటలు
వేటూరి పాటలు ఇల్లాలికి ముచ్చటలు
వేటూరి పాటలు ఏటిలోని నీటి మూటలు
వేటూరి పాటలు దివిసీమ లోని పా(ఆ)ట
విడుపులు..!

# మహాభారతం - పాత్రలు

**కె.హేమచందర్ - 94400 21108**

(గత వారం తరువాయి)

**కుబేర సభ :** మందార, పారిజాతాది వృక్షాలు ఉంటాయి. నరులు, కిన్నరులు అనే గంధర్వులు, వరాహ కర్ణుడు, గజకర్ణుడు మొదలైన యక్షులు, నలకూబరుడు, ఊర్వశి, తిలోత్తమ తదితర అప్సరసలు ఉంటారు. (కుబేరుడి మిత్రుడు శివుడు).

**బ్రహ్మసభ :** విశ్వకర్తలు మనువు, అత్రి,మరీచి, సూర్యచంద్ర గ్రహ నక్షత్ర సమూహాలు, దేవగణాలు, వసువులు, రుద్రులు, సిద్ధులు సాధులు

**మయుడు :** దానవ విశ్మకర్మ. మయసభను నిర్మించిన శిల్పి.

**బిందుసారం :** ఒక సరస్సు. వివిధ రకాల రత్నాలను మయుడు భద్రపర్చిన స్థలం

**విశ్వకర్మ :** ప్రభావసుడనే వసువు కుమారుడు

**సంజ్ఞ :** విశ్వకర్మ కుమార్తె, సూర్యదేవుడి భార్య

**ఇల :** వైవస్వత మనువు కుమార్తె

**ఇక్ష్వాకువు :** వైవస్వత మనువు కుమారుడు. శ్రీరాముని వంశానికి మూలపురుషుడు.

**యయాతి :** నహుషుడి కుమారుడు, దేవయాని, శర్మిష్టల భర్త

**వృషపర్వుడు :** దానవ రాజు

**దేవదత్తం :** అర్జునుడి శంఖం. (మయుడు ఇచ్చినది)

**హరిశ్చంద్రుడు :** త్రిశంకుడి కుమారుడు. అయోధ్య రాజు.

**ఉగ్రశ్రవసుడు :** రోమహర్షణుని పుత్రుడు

**సప్తద్వీపాలు :** జంబూద్వీపం, ప్లక్షద్వీపం, కుశద్వీపం, క్రౌంచ ద్వీపం, శౌకద్వీపం, శాల్మల ద్వీపం, పుష్కర ద్వీపం.

**భగదత్తుడు :** ప్రాగ్జోతిషం రాజ్యానికి రాజు

**శిశుపాలుడు :** ఛేది రాజ్యానికి రాజు


**వసురాజు :** బృహద్రధుడి తండ్రి (తారకాసురుడితో

**బృహద్రధుడు :** జరాసంధుడి తండ్రి

**జరాసంధుడి కుమార్తెలు :** అస్తి, ప్రాస్తి

**కంసుడి భార్యలు :** అస్తి, ప్రాస్తి (జరాసంధుడి కుమార్తెలు)

**బ్రహ్మదత్తుడు :** సాల్వదేశ రాజు (కృష్ణుడితో రాజసూయం చేయాలని ప్రయత్నించి భంగపడ్డాడు)



**హంసుడు, డిభకుడు :** బ్రహ్మదత్తుడి కుమారులు (కౌశికుడు, చిత్రసేనుడు) (జరాసంధుడికి ఆప్తులు).. (ఆయుధాల వల్ల వారికి చావు లేదు. హంసుడు మృతి చెందాడని చెప్పడంతో డింభకుడు నీళ్లలో మునిగి మృతి చెందాడు. డింభకుడి మృతి వార్తతో హంసుడు చనిపోయాడు.

**కక్షీవంతుడు :** దీర్ఘతముడు, ఉసిజల కుమారుడు. (సుదేష్ణదాది కుమార్తె ఉసిజ). మహర్షి. స్వనయుడనే రాజు తన కుమార్తెను కక్షీవంతుడికి ఇచ్చి వివాహం చేశాడు. బృహద్రధుడికి సంతానం కోసం మంత్రించిన మామిడి పండును ఇచ్చినవాడు. అలా జన్మించినవాడే జరాసంధుడు.

**జర :** రాక్షసి. రెండు ముక్కలుగా పడి ఉన్న మాంసం ముద్దలు కలిపింది. ఆ ఏకమైన మాంసం ముద్దలే జరాసంధుడు. బాలుడిని అప్పగించినందుకు కృతజ్ఞతగా ఆ రాక్షసి పేరుతోనే జరాసంధుడు అని నామధేయం చేశారు. ప్రతిఏటా జర రాక్షసికి ఉత్సవం నిర్వహించాడు బృహద్రధుడు.

**సహదేవుడు :** జరాసంధుడి కుమారుడు. భీముడితో మల్లయుద్ధానికి ముందు సహదేవుడికి రాజ్యాభిషేకం చేశాడు.

**శిశుపాలుడు :** ఛేది రాజ్యానికి రాజు

**ధృష్టకేతుడు :** శిశుపాలుడి కుమారుడు

**సునీధుడు :** శిశుపాలుడి సేనాధిపతి

**వికర్ణుడు :** ధృతరాష్ట్ర సంతానం. కురుసభలో ద్రౌపదికి మద్దతుగా మాట్లాడి నాడు. జూదంలో ద్రౌపదిని ఒడ్డే అధికారం ధర్మరాజుకు లేదని స్పష్టం చేసినవాడు. ఆమెను సభకు రప్పించడం తప్పని చెప్పినవాడు. దుర్యోధునుడి తమ్ముళ్లలో ఒకడు.

**అరణ్యపర్వం..**

మహాభారతంలోని అరణ్యపర్వంలో ఎన్నో కథలున్నాయి. మానసికంగా కృంగిపోయిన ధర్మరాజుకు నీతి, ధర్మబోధ చేస్తూ ధైర్యం కలిగించిన పూర్వీకుల గురించి తెలిపిన గాథలే అవన్నీ. కృష్ణుడి ప్రియసఖి సత్యభామకు దాంపత్య బంధం గురించి ద్రౌపది చెప్పినదీ ఈ పర్వంలోనే. రామాయణ ప్రస్తావన కూడా ఇందులోనే. పసిపిల్లలకు ఏదైనా తినిపించినా, తాగించినా 'జీర్ణం.. జీర్ణం.. వాతాపి జీర్ణం' అనడం వెనుక ఉన్న వాతాపి కథ కూడా తెలుసుకోవచ్చు. పద్మవ్యూహంలో అభిమన్యుడి మరణానికి కారణమైన సైంధవుడి గురించి ఈ పర్వంలోనే తెలుస్తుంది. కురుక్షేత్ర యుద్ధంలో దుర్యోధనుడి తొడలు భీముడు విరగ్గొడతాడు. దానికి మూలం దుర్యోధనుడికి మైత్రేయ మహర్షి శాపం కూడా ఇందులోనే. నిన్ను అవమానపర్చిన ధృతరాష్ట్ర సంతతి హతమవడం ఖాయమని ద్రౌపదికి కృష్ణుడు వాగ్దానమిస్తాడు. అటు శివుడి నుంచి పాశుపతాస్త్రాన్ని, ఇటు నపుంసకుడివి కావాలనే ఊర్వశి శాపాన్ని అర్జునుడు పొందినదీ ఈ పర్వంలోనే. ఒక్క మాటలో చెప్పాలంటే అరణ్యపర్వం పాండవులకే కాదు, పఠించినవారికీ పుణ్యమే.

**శౌనకుడు :** బ్రహ్మర్షి. అడవుల్లో తన వెంట వచ్చిన వారికి భోజనాలు ఏలా ఏర్పాటు చేయాలని దిగులుగా ఉన్న ధర్మరాజుకు మార్గదర్శనం చేస్తూ జనక గీతాలు వివరించినవాడు.

**అక్షయ పాత్ర :** ధౌమ్యుడి ఉపదేశంతో ధర్మరాజు ప్రార్థన చేయడంతో, ప్రత్యక్ష భగవానుడు ప్రత్యక్షమై ఇచ్చినదే అక్షయ పాత్ర. అరణ్యవాసంలో వచ్చినవారందరి ఆకలిని ఈ పాత్రద్వారానే ద్రౌపదీమాత తీర్చింది.

సురభి : గోమాత

**మైత్రేయుడు :** వ్యాసుడి శిష్యుడు. హితబోధ చేస్తున్న మైత్రేయుడి పట్ల దుర్యోధనుడు అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో ఆగ్రహించిన ఆయన యుద్ధంలో తొడలు విరిగి మూలుగుతావు అని దుర్యోధనుడిని శపించాడు.

**కిమ్మీరుడు :** బకాసురుడి తమ్ముడు. హిడింబుడి మిత్రుడు. భీముడి చేతిలో హతమయ్యాడు.

**సాల్వుడు :** శిశుపాలుడి సోదరుడు.

**ధృష్టకేతు :** నకులుడి భార్య రేణుమతి సోదరుడు. శుక్తుమతి రాజు.

**మూకుడు :** శివుడు, అర్జునుడు వేటాడిన వరాహరూపంలోని రాక్షసుడు

**చిత్రసేనుడు :** అమరావతిలో అర్జునుడికి నృత్యగీతాలు నేర్పించినవాడు

**బృహదశ్వుడు :** ముని, అడవుల్లో ధర్మరాజుకు నలదమయంతి గాథ వివరించి మానసిక ధైర్యం కల్పించినవాడు

(మిగతా తరువాయి సంచికలో)

# బుడత



## బాలల కథ

# నమ్మకమే ఆస్తి



అనగనగా ఒక ఊరిలో రామయ్య అనే సామాన్య వ్యక్తి ఉండేవాడు. రామయ్య దగ్గర పెద్దగా ఆస్తిపాస్తులు లేవు, కానీ అతను ఎప్పుడూ చాలా హుందాగా, తెల్లటి బట్టలు వేసుకుని, ముఖంపై చిరునవ్వుతో కనిపించేవాడు.

ఒకరోజు రామయ్య తన పాత పెట్టెను శుభ్రం చేస్తుండగా, పొరుగువాడు చూసి, ఏంటి రామయ్య, ఆ పెట్టెను అంత జాగ్రత్తగా దాస్తున్నావు? అందులో ఏముంది? నీ పూర్వీకుల బంగారు నగలా? అని అడిగాడు. రామయ్య నవ్వి, ఇందులో ఉన్నది నా జీవితకాలపు సంపాదన. సరైన సమయం వచ్చినప్పుడే బయటకు తీస్తాను అని బదులిచ్చాడు.

**మార్పు :** ఈ మాట ఊరంతా పాకిపోయింది. రామయ్య దగ్గర ఏదో రహస్య నిధి ఉంది అని అందరూ నమ్మడం మొదలుపెట్టారు. అప్పటి వరకు అతన్ని పట్టించుకోని వారు కూడా ఇప్పుడు గౌరవించడం మొదలుపెట్టారు.

వ్యాపారులు: రామయ్యకు అప్పు ఇవ్వడానికి పోటీ పడ్డారు.

**బంధువులు:** అతనికి కానుకలు పంపడం మొదలుపెట్టారు.

**గ్రామస్తులు:** పంచాయితీల్లో రామయ్య మాటకే విలువ ఇచ్చారు, ఎందుకంటే అతను ధనవంతుడు అని వారు భావించారు.


రామయ్య ఆ పెట్టెను ఎప్పుడూ తెరవలేదు, కానీ ఆ పెట్టెలో నిధి ఉందనే నమ్మకం అతనికి సమాజంలో ఎనలేని గౌరవాన్ని, పరపతిని తెచ్చిపెట్టింది.


**నిజం :** కొన్నేళ్ల తర్వాత రామయ్య మరణించాడు. గ్రామస్తులందరూ ఆత్రుతగా ఆ పెట్టెను తెరిచారు. అందులో ఉన్నది చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అందులో బంగారం లేదు, వజ్రాలు లేవు. కేవలం కొన్ని పాత రాళ్లు, ఇసుక మాత్రమే ఉన్నాయి. దీనితో పాటు ఒక చిన్న ఉత్తరం ఉంది:

నా దగ్గర ఉన్నది ఏమీ లేదు. కానీ నేను ధనవంతుడినని మీరు నమ్మడం వల్లే, నాకు ఈ గౌరవం, ఆదరణ దక్కాయి. మనిషి విలువ అతను కలిగి ఉన్న దానిలో లేదు, ఇతరులు అతను ఏమి కలిగి ఉన్నాడని నమ్ముతారో అనే దానిలోనే ఉంది.

**నీతి :** ఒక వ్యక్తి యొక్క విలువ అతను అనుభవించే వస్తువుల మీద కంటే, సమాజం అతని గురించి కలిగి ఉన్న అభిప్రాయం మీదనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.

**మండా వెంకట అప్పారావు ,(9347589272)**





### 4x4 Easy

| | | | |
|---|---|---|---|
| 3 | 4 | 1 | 2 |
| | | | 4 |
| 4 | | | |
| 2 | 3 | 4 | 1 |

### 4x4 Hard

| | | | |
|---|---|---|---|
| 1 | | | 2 |
| 2 | 4 | | |
| | | 2 | 4 |
| 4 | | | 3 |

### 6x6 Easy

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | 4 | 2 | 6 | 5 |
| | 6 | 3 | 5 | 1 | 4 |
| 5 | 2 | 1 | 4 | 3 | |
| 3 | 1 | 5 | 6 | | |
| | | | | | |

### 6x6 Hard

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | 6 | | |
| 1 | | | 2 | | |
| 2 | | | | 4 | 5 |
| 3 | 4 | | | | 1 |
| | | 6 | | | 4 |
| | | 1 | | | |

ఆదివారం అనుబంధం
సూర్య
www.suryaa.com
1.2.2026

# భార్యా,భర్తల మధ్య మాయమవుతున్న స్పర్శ



పెరుగుతున్న విడాకుల వెనుక మౌన కారణం ఈ రోజుల్లో విడాకుల సంఖ్య పెరుగుతోందంటే అందుకు కారణాలుగా ఆర్థిక సమస్యలు, అన్యోన్యత లోపం, కుటుంబ జోక్యం వంటి అంశాలు చెప్పుకుంటున్నాం. కానీ వీటన్నింటికన్నా లోతుగా పరిశీలిస్తే కనిపించే ఒక ప్రధాన కారణం.. భార్యా భర్తల మధ్య స్పర్శ, ప్రేమగా మాట్లాడే మాటలు, భావోద్వేగ సాన్నిహిత్యం క్రమంగా కనుమరుగవడం. వివాహం అనేది కేవలం చట్టబద్ధమైన ఒప్పందం కాదు. అది ఇద్దరు మను షుల మధ్య ఏర్పడే భావోద్వేగ బంధం. ఆ బంధాన్ని బలంగా నిలబెట్టేది‌బ్బు కాదుసౌకర్యాలు కాదు ఆప్యాయత, అర్థం చేసుకునే మనసు, ఒకరికి ఒకరు ఇచ్చే భరోసా.

**స్పర్శ అంటే బలహీనత కాదు భద్రత :** బలవంతుడైనా, బలహీనుడైనా..
భర్త అయినా, భార్య అయినా, ప్రతి మనిషికీ ఒక్కోసారి"నేనున్నాను" అనే స్పర్శ కావాలి. అది శారీరక అవసరంగా మాత్రమే కాదు, మనసుకు ఇచ్చే ధైర్యంగా పనిచేస్తుంది.

భర్త రోజంతా పని ఒత్తిడితో ఇంటికి వస్తాడు. భార్య ఇంటి పనులు, పిల్లల బాధ్యతలతో అలసిపోయి ఉంటుంది.


ఇద్దరూ అలసిపోయిన వేళ...మాటలు కఠినంగా మారితే అపార్థాల విత్తనం అక్కడే పడుతుంది. అదే సందర్భంలో భార్య "రోజంతా అలసిపోయావు కదా" అని చెప్పిన ఒక్క మాటలేదా భర్త
"నీ వల్లే ఇల్లు నడుస్తోంది" అని అన్న ఒక్క వాక్యం ఆ రోజు భారాన్ని తేలిక చేస్తుంది.
డబ్బు ఉంది కానీ ధైర్యం లేదు చాలా కుటుంబాల్లో డబ్బుకు కొదవ లేదు.
కానీ బాధను పంచుకునే మాటకు కొదవ ఉంది. కన్నీళ్లను తుడిచే స్పర్శకు కొదవ ఉంది.అందుకే చిన్న చిన్న ఇక్కట్లకే భార్యా,భర్తల మధ్య దూరం పెరుగుతోంది.
మాటలు తగ్గిపోతున్నాయి. మౌనం పెరుగుతోంది. ఆ మౌనమే చివరకు పెద్ద గోడగా మారుతోంది. ఉదాహరణ మన చుట్టూనే ఉంది ఎంతో ఆనందంగా కనిపించే కుటుంబాల్లో కూడా చిరునవ్వుల వెనుక పంటి బిగువున భరిస్తున్న కష్టాలు ఉండొచ్చు.
మౌనంగా తన పని తాను చేసుకునే భర్త తీవ్రమైన ఒత్తిడిలో ఉండొచ్చు.
అన్నీ భరిస్తూ కనిపించే భార్య లోపల ఒంటరితనంతో పోరాడుతుండొచ్చు.
ఎంతటి ధైర్యవంతులైనా పరిస్థితులు అనుకూలించనప్పుడు కుంగిపోతారు.
అప్పుడు వారికి కావలసింది. సలహా కాదునింద కాదు అర్థం చేసుకునే మనసు.
ప్రేమ మాటలు లేనప్పుడు బంధం ఎండిపోతుంది. ఉలి దెబ్బలు తగలకుండా శిల శిల్పంగా మారుతుందా? ఎత్తుపల్లాలు చూడకుండా శిఖరం చేరిన దంపతులు ఎవరైనా ఉన్నారా? ప్రతి వివాహంలోనూ అపార్థాలు ఉంటాయి. నిరాశ ఉంటుంది. కష్టాలు తప్పవు. కానీ వాటిని తట్టుకునే శక్తిని ఇచ్చేది ప్రేమగా మాట్లాడే మాటలు ఆత్మీయ స్పర్శ ఒకరికి ఒకరు ఇచ్చే నమ్మకం. మార్పు పెద్దది కాదు చిన్నదే రోజుకు ఒక మంచి మాట. అవకాశమైతే ఒక ఆప్యాయమైన స్పర్శ. తీరిక చేసుకుని ఒకరినొకరు వినడం.
ఇవే విడాకుల అంచుల వరకు వెళ్లే బంధాలను మళ్లీ జీవంతో నింపగలవు. ఎందుకంటే.. భార్యా,భర్తల మధ్య ఒక చిన్న స్పర్శ, ఒక మంచి మాట కోట్ల రూపాయల కన్నా విలువైనది. అది బంధాన్ని మాత్రమే కాదుఒక జీవితాన్నే నిలబెడుతుంది.
ఒక మాట విడాకుల గణాంకాలు పెరుగుతున్నా యంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. చట్టాలు, కౌన్సెలింగ్ కేంద్రాలు, అవగాహన కార్యక్రమాల గురించి మాట్లాడుతున్నాం. కానీ ఇంటి గడప దాటని ఒక చిన్న లోపాన్ని మనం పట్టించుకోవడం లేదు. భార్యాభర్తల మధ్య ప్రేమగా మాట్లాడే మాటల లోటును, ఆత్మీయ స్పర్శల కొరతను. సంబంధాలు కోర్టుల్లో కాదు
**కిచెన్‌లో, బెడ్‌రూమ్‌లో, బాల్కనీలో,**
రోజువారీ సంభాషణల్లో బతుకుతాయి లేదా చస్తాయి. భార్యాభర్తలు ఒకరినొకరు గెలవాలని కాదుఒకరినొకరు నిలబెట్టాలని ప్రయత్నించినప్పుడు వివాహం అర్థం పొందుతుంది. ఈ రోజు మనం అడగాల్సిన ప్రశ్న ఇదే.. మన ఇంట్లో చివరిసారి ప్రేమగా మాట్లాడిన రోజు ఏది?
ఆత్మీయంగా భుజం తడిచిన క్షణం ఎప్పుడు? మార్పు పెద్ద నిర్ణయాలతో మొదలవదు. ఒక మంచి మాటతో మొదలవుతుంది. ఒక చిన్న స్పర్శతో కొనసాగుతుంది. అవి లేకపోతే డబ్బు, హోదా, విజయాలు అన్నీ ఉన్నా బంధం ఖాళీగానే మిగులుతుంది. విడాకులను తగ్గించాలంటే ముందుగా మన మాటలను మృదువుగా మార్చాలి. మన చేతులను ఆప్యాయంగా మార్చాలి. ఇది చట్టాల బాధ్యత కాదు ఇది ప్రతి భార్యా, భర్తల వ్యక్తిగత బాధ్యత.



**. డా హిప్నో పద్మ కమలాకర్**
**సైకాలజిస్ట్ ఱ హిప్నో థెరపిస్ట్**
**హైదరాబాద్ –**
***9390044031***

# రిటైలర్లకు టెక్నో స్పోర్ట్స్ - బ్లూ ఒరిజినల్ ప్రోగ్రామ్

తెలుగు రాష్ట్రాల్లో చిన్న చిన్న పట్టణాల్లో ఉండే రిటైలర్లకు టెక్నో స్పోర్ట్స్ యొక్క బ్లూ ఒరిజినల్ ప్రోగ్రామ్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇవాళ మనకు కన్పించే బట్టల దుకాణాలు, క్రీడా దుస్తుల దుకాణాలకు విపరీతమైన పోటీ ఉంది. ఇందుకు అనేక కారణాలున్నాయి. పోటీతత్వం పెరిగిపోవడం, మారుతున్న కస్టమర్ డిమాండ్ ను అర్థం చేసుకోకపోవడం, స్థానికంగా షాపింగ్ చేసేటప్పుడు కూడా వినియోగదారులు అధిక షాపింగ్, విభిన్నమైన మోడల్స్ కోసం చూడడం లాంటి కారణాలు ఉన్నాయి. అదే సమయంలో, వ్యవస్థీకృత రిటైల్ మరియు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఒత్తిడి పెరుగుతూనే ఉంది. ఈ మార్పులను ముందుగానే గుర్తించి, టెక్నోస్పోర్ట్ చిన్న పట్టణ రిటైలర్లకు మద్దతు ఇవ్వడానికి తన బ్లూ ఆరిజిన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. వారి దుకాణాలను బలోపేతం చేయడానికి, కస్టమర్ నమ్మకాన్ని మెరుగుపరచడానికి మరియు స్థిరంగా అభివృద్ధి చెందడానికి వారికి సహాయపడుతుంది.మొదటగా దక్షిణ భారతదేశంలో ప్రారంభించబడిన బ్లూ ఆరిజిన్ ప్రోగ్రామ్, టెక్నోస్పోర్ట్ యొక్క వేలాది మంది రిటైలర్ల నెట్‌వర్క్ తో సన్నిహితంగా పనిచేస్తుంది. వీరిలో చాలామంది స్థానిక సమాజంతో లోతైన సంబంధాలున్న కుటుంబ వ్యాపారాలను నడుపుతున్నారు. అందువల్ల స్వల్పకాలిక వాణిజ్య పథకాలపై దృష్టి పెట్టకుండా, ఈ కార్యక్రమం దుకాణాల ప్రదర్శన, ఉత్పత్తుల లభ్యత మరియు అమ్మకాలపై ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరిచే దీర్ఘకాలిక, ఆర్థికేతర మద్దతును అందిస్తుంది. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్ నగర్‌లో 2006 నుండి మహాలక్ష్మి స్పోర్ట్స్ నడుపుతున్న అనిల్ కుమార్, వెరైటీని కోరుకునే వినియోగదారుల డిమాండే తన వ్యాపారనికి గొప్ప మలుపుగా చెప్పాడు. ఆయన మాట్లాడుతు... గతంలో, పరిమిత ఎంపికలు ఉండేవి. సరైన మోడల్‌లు అందుబాటులో ఉండేవి కావు. మేము టెక్నోస్పోర్ట్ తో అసోసియేట్ అయనప్పుడు, ఉత్పత్తి నాణ్యత మరియు సరఫరా చాలా బాగున్నాయి. మొదట్లో మేము కొన్ని టీ–షర్టులు మరియు ట్రాక్ ప్యాంట్‌లను తీసుకువచ్చాము. ఎక్కువ మంది కస్టమర్లు వెరైటీ కోసం అడగడం ప్రారంభించడంతో, మేము పూర్తి కేటలాగ్‌ను అందుబాటులో ఉంచాము. అప్పటి నుండి, వ్యాపారం అభివృద్ధి చెందడం ప్రారంభించింది. అని అన్నారు. ఆయన మాట్లాడుతూ.. నిరంతర సరఫరా– రిపీటెడ్ కస్టమర్ల వల్ల ఆదాయం మరింతగా బలపడింది. నా కస్టమర్లలో దాదాపు 80 శాతం మంది పాత కస్టమర్లే. ఉత్పత్తులు బాగుంటాయి, సరఫరా వ్యవస్థ అద్భుతంగా ఉంది, మరియు నేను రెగ్యులర్ ఆర్డర్లు పెట్టినప్పుడు నాకు వేగంగా డెలివరీ లభిస్తుంది," అని అనిల్ కుమార్ అంటున్నారు. "టెక్నోస్పోర్ట్ వల్ల నా వ్యాపారం గణనీయంగా వృద్ధి చెందింది, మరియు నేను, నా కుటుంబం చాలా సంతోషంగా ఉన్నాము." అని అన్నారు.
విశాఖపట్నంలో, గాజువాక జంక్షన్‌లోని న్యూ సచిన్ స్పోర్ట్స్ కు చెందిన ప్రకాష్ శర్మ మాట్లాడుతూ, ఈ అసోసియేషన్ ప్రొడక్ట్ రేంజ్,స్టోర్ గుర్తింపు రెండింటినీ విస్తరించడంలో సహాయపడిందని చెప్పారు. ఇది మా కుటుంబ వ్యాపారం, మరియు మేము 30 సంవత్సరాలకు పైగా రిటైల్‌లో ఉన్నాము. మేము మొదట టెక్నోస్పోర్ట్ ఉత్పత్తులను చూసినప్పుడు, నాణ్యత మరియు ధర మాకు నచ్చింది. కొనసాగించాలని నిర్ణయించుకున్నాము అని ఆయన చెప్పారు. మేము ట్రాక్ ప్యాంటు మరియు టీ–షర్టులతో ప్రారంభించాము, తరువాత స్కిన్ టైట్స్ మరియు స్పోర్ట్స్ బ్రాలతో సహా మహిళల దుస్తులలోకి విస్తరించాము. అని అన్నారు.
స్టోర్ బ్రాండింగ్ మరియు మా వ్యాపార అభివృద్ధికి మద్దతు ఇచ్చినందుకు బ్లూ ఆరిజిన్ ప్రోగ్రామ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "టెక్నోస్పోర్ట్ మరియు బ్లూ ఆరిజిన్‌తో, మా స్టోర్ బ్రాండింగ్ మెరుగుపడింది. వారు ప్రకటనలతో మాకు మద్దతు ఇచ్చారు. అమ్మకాలు పెరిగాయి, మా వ్యాపారం విస్తరించింది మరియు మేము ఇప్పుడు మరొక ప్రత్యేకమైన టెక్నోస్పోర్ట్ షోరూమ్‌ను ప్లాన్ చేస్తున్నాము అని ప్రకాష్ శర్మ చెప్పారు. దీర్ఘకాలిక వృద్ధికి బలమైన అవకాశం ఉంది మరియు నేను ఈ బ్రాండ్‌ను ఇతర రిటైలర్లకు సిఫార్సు చేస్తాను. అని అన్నారు.
చిన్న పట్టణాల్లో ఉండే రిటైలర్లు కస్టమర్ డిమాండ్‌కు అనుగుణంగా స్పందించడం, ప్రెజెంటేషన్‌ను మెరుగుపరచడం మరియు పునరావృత వ్యాపారాన్ని నిర్మించడంలో



సహాయపడటం ద్వారా, బ్లూ ఆరిజిన్ ప్రోగ్రామ్ తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ అంతటా పొరుగు దుకాణాలను అభివృద్ధి చెందుతున్న రిటైల్ ల్యాండ్‌స్కేప్‌లో నమ్మకంగా అభివృద్ధి చెందడానికి సాధికారత కల్పిస్తోంది.

# త్రిదోష ప్రకృతి ఆధారంగా మానసిక లక్షణాలు

ఆయుర్వేదంలో ప్రకృతి అనేది శరీర నిర్మాణానికే పరిమితం కాకుండా, మనస్సు, భావోద్వేగాలు, ఆలోచనా విధానం, వ్యక్తిత్వ లక్షణాలను కూడా నిర్ధారిస్తుంది. వాత, పిత్త, కఫ ప్రకృతుల ఆధిక్యత ఆధారంగా వ్యక్తుల మానసిక లక్షణాలలో స్పష్టమైన భేదాలు కనిపిస్తాయి. చరక సంహిత ప్రకారం "ప్రకృతిర్హి బలవతీ" , వ్యక్తి యొక్క ప్రకృతి అతని ఆరోగ్య స్థితిని, వ్యాధి ప్రవణతను మాత్రమే కాకుండా మానసిక స్వభావాన్ని కూడా నిర్ణయిస్తుంది. త్రిదోషాల సమతుల్యతలో మనస్సు ప్రశాంతంగా, స్థిరంగా ఉంటుంది. దోష వికృతి ఏర్పడినప్పుడు మానసిక అశాంతి, భావోద్వేగ అసమతుల్యత ఉద్భవిస్తుంది. వాత ప్రకృతి మానసిక లక్షణాలు; చలనం, వేగం, లఘుత్వం, అస్థిరత్వం,ఆలోచనా విధానం: ఆలోచనలు చాలా వేగంగా వస్తాయి, ఒకే సమయంలో అనేక విషయాలు ఆలోచిస్తారు, కొత్త కొత్త ఐడియాస్ పుట్టుకొస్తాయి, నిలకడ లేమి, గజి బిజి ఆలోచనలు, సృజనాత్మకత, భావోద్వేగాల నియంత్రణ తక్కువ,త్వరగా ఉత్సాహపడతారు, అలాగే త్వరగా నిరుత్సాహపడతారు **భయం, ఆందోళన, అస్థిరత ఎక్కువ. వ్యక్తిత్వ లక్షణాలు:** మాట్లాడే తీరులో వేగం, కలల లోకంలో ఎక్కువగా జీవిస్తారు,నిర్ణయాలు తీసుకోవడంలో సందేహం ,ప్రారంభిస్తారు కానీ పూర్తిచేయడంలో కష్టం. ఆధునిక మానసిక ఆరోగ్య శాస్త్రం ప్రకారం , యాంగ్జైటీ , జనరలైజ్ యాంగ్జైటీ డిసార్డర్ , ఎ డి హెచ్ డి, ఇన్సోమ్నియా , పానిక్ ఎటాక్ మొదలైనవన్నీ వాతం ఆధిక్యంగా గల వ్యక్తులు లోనయ్యే మానసిక అవస్థలు.
**మానసిక బలహీనతలు:** నిద్రలేమి,టెన్షన్, భయం, మూడ్ స్వింగ్స్, ఏకాగ్రత లోపం. అంతిమంగా వాత వ్యక్తి కళాత్మకుడు, ఆలోచనాశీలి, కానీ మానసికంగా సులభంగా కలవరపడే వ్యక్తి.
పిత్త ప్రకృతి మానసిక లక్షణాలు ; తేజస్సు, ఉష్ణ స్వభావం, తీక్ష్ణత, బుద్ధి కుశలత, **ఆలోచనా విధానం,** తార్కికంగా, స్పష్టంగా ఆలోచిస్తారు.సమస్యకు వెంటనే పరిష్కారం కావాలి.విశ్లేష ణా శక్తి ఎక్కువ
**భావోద్వేగాలు:**ఆత్మవిశ్వాసం ఎక్కువ, కోపం త్వరగా వస్తుంది,అసహనం, ఆగ్రహం ఎక్కువగా కనిపిస్తుంది. వ్యక్తిత్వ లక్షణాలు:
**నాయకత్వ లక్షణాలు,** ఆధిపత్య స్వభావం, పనిని పక్కాగా పూర్తి చేయాలనే పట్టుదల,
విమర్శనాత్మక దృష్టి ఎక్కువ. టైప్ ఏ పర్సనాలిటీ , బర్నౌట్ , ఇంటర్మిటెంట్ ఎక్స్ప్లోసివ్ డిసార్డర్ , నారసిస్టిక్ ట్రెయిట్స్ , మొదలైన ఆధునిక మానసిక ఆరోగ్య శాస్త్రం చెబుతున్న అవస్థలు ఈ పిత్త ప్రకృతి వారికి కనబడుతాయి.
**మానసిక బలహీనతలు:** కోపం, ఆవేశం,అహంకారం, అసూయ, ద్వేషం, ఎక్కువ ఆశలు, ఆకాంక్షలు పెట్టుకో వడం. మొత్తంగా పిత్త ప్రకృతి వ్యక్తి , బుద్ధిమంతుడు, నాయకుడు, కానీ భావోద్వేగాల వ్యక్తీకరణలో తీవ్రత ఉన్న వ్యక్తి

**కఫ ప్రకృతి మానసిక లక్షణాలు:** స్థిరత్వం, శాంతి, మృదుత్వం, సహనం,ఆలోచనా విధానం: నెమ్మదిగా కానీ, లోతుగా ఆలోచిస్తారు. విషయాలను త్వరగా మర్చిపోరు, **స్థిరమైన అభిప్రాయాలు.భావోద్వేగాలు:** సహనం, క్షమా గుణం, ప్రేమ, అనురాగం ఎక్కువ.
**భావోద్వేగ పరంగా స్థిరంగా ఉంటారు.వ్యక్తిత్వ లక్షణాలు:** విశ్వసనీయులు, ఓర్పు ఉన్న వ్యక్తులు,
**కుటుంబ, సంబంధాలకు ప్రాధాన్యం,** మార్పులకు ఇష్టపడరు, మేజర్ డిప్రెసివ్ డిసార్డర్ , డిస్తీమియా, హోర్డింగ్ డిసార్డర్, డిపెండెన్సీ డిసార్డర్ మొదలైన ఆధునిక మానసిక ఆరోగ్య శాస్త్రం చెబుతున్న రుగ్మతలు వీరిలో చూడవచ్చు.
**మానసిక బలహీనతలు:** అలసత్వం,
ఉదాసీనత, మృదుత్వం, సున్నితత్వం మార్పును అంగీకరించకపోవడం, మొత్తంగా , శాంత స్వభావి, నమ్మకమైన వ్యక్తి, కానీ జడత్వం ఎక్కువయ్యే అవకాశం.త్రిదోష సమతుల్యం ఆదర్శ మానసిక స్థితి, వాత యొక్క సృజనాత్మకత, పిత్త యొక్క బుద్ధి, నిర్ణయ సామర్థ్యంకఫ యొక్క శాంతి, స్థిరత్వం, ఈ మూడు సమతుల్యంగా ఉన్నప్పుడు, స్పష్టమైన ఆలోచన, శాంతమైన మనసు, సమర్థమైన కార్యశక్తి లభిస్తుంది.
**మనో గుణాల సంబంధం ద:** మానసిక ఆరోగ్యాన్ని వివరించడానికి ఆయుర్వేదం సత్వ (సమతుల్యత), రజో (క్రియాశీలత) మరియు తమో (జడత్వం) గుణాల ద్వారా ఇంకా విపులంగా ఈ ప్రకృతి లను అర్థం చేసుకోవచ్చు. రజో గుణ స్థితులు వాత/పిత్త దోషాలతో (ఆందోళన/చంచలత్వం) సంబంధం కలిగి ఉంటాయి. తమో గుణ స్థితులు కఫ దోషంతో (నిరాశ/అజ్ఞానం) సంబంధం కలిగి ఉంటాయి.భావోద్వేగ నియంత్రణ మరియు స్పష్టత అయిన సాత్విక స్థితియే ఆధునిక చికిత్స యొక్క లక్ష్యం.
**రజో గుణం:** వాత, పిత్త దోషాల వల్ల కలిగే ఆందోళనను వివరిస్తుంది.
**తమో గుణం**: కఫ దోషం వల్ల కలిగే నిరాశను వివరిస్తుంది.
**సత్వ గుణం:** మానసిక సమతుల్యతను సూచిస్తుంది. ప్రకృతి అనేది వ్యక్తి మానసిక స్వభావానికి మూలాధారం. దోష ప్రకోపం నివారణ ద్వారా మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుంది. ఆయుర్వేదం సూచించే ప్రకృతి ఆధారిత జీవనశైలి, యోగా, ధ్యానం సమగ్ర ఆరోగ్యానికి మార్గదర్శకం.



**డా జి మహేంద్ర కుమార్ రెడ్డి**
**ఆయుర్వేదిక్ ఫిజిషియన్**
**మహేంద్రాస్ మైండ్ అండ్ బాడీ**

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఆదివారం అనుబంధం
1.2.2026

# థైరాయిడ్ క్యాన్సర్ వెనుక ఉన్న జన్యు కారణాలు

థైరాయిడ్ క్యాన్సర్ చా లా నా ం ్ల తెలియకుండానే శరీరంలోకి ప్రవేశిస్తుంది మెడ వద్ద చిన్న గడ్డ, సాధారణంగా అనిపించే అలసట, లేదా సాధారణ పరీక్షల్లో అకస్మాత్తుగా బయటపడే విషయం. కుటుంబాలకు ఇది ఊహించని షాక్‌లా ఉంటుంది, ముఖ్యంగా స్పష్టమైన కారణం కనిపించనప్పుడు. అయితే, శాస్త్రం ఇప్పుడు ఒక దాగి ఉన్న అంశాన్ని వెలుగులోకి తీసుకొస్తోంది: జన్యు కారకాలు .థైరాయిడ్ క్యాన్సర్ వెనుక ఉన్న జన్యు అంశాలను అర్థం చేసుకోవడం ఇక కేవలం ల్యాబ్‌లు లేదా నిపుణులకే పరిమితం కాదు. ఆలస్యమైన నిర్ధారణ ఇప్పటికీ పెద్ద సమస్యగా ఉన్న భారతదేశంలో, ఇది కుటుంబాలకు అవసరమైన అవగాహనగా మారుతోంది.

**థైరాయిడ్ క్యాన్సర్ ఎందుకు గుర్తించబడకుండా ఉంటుంది?**

థైరాయిడ్ గ్రంథి శరీరంలో మెటబాలిజం, హృదయ స్పందన, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే కీలక పాత్ర పోషిస్తుంది. మెడ అడుగుభాగంలో ఉండే ఈ చిన్న, సీతాకోకచిలుక ఆకార గ్రంథిలో క్యాన్సర్ ఏర్పడినప్పుడు, ప్రారంభ లక్షణాలు చాలా సూక్ష్మంగా ఉంటాయి. చాలా మంది రోగులు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నట్లు భావిస్తారు, దీనివల్ల వైద్య సహాయం ఆలస్యం అవుతుంది.

భారతదేశంలోని క్లినికల్ పరిశీలనలు మరియు జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీల సమాచారం ప్రకారం, అనేక థైరాయిడ్ క్యాన్సర్ కేసులు ఇతర ఆరోగ్య పరీక్షల సమయంలో యాదృచ్ఛికంగా గుర్తించబడుతున్నాయి. ఈ నిశ్శబ్ద ప్రగతి కారణంగా, ఎవరు ఎక్కువ ప్రమాదంలో ఉన్నారో తెలుసుకోవడం మరింత అవసరం అవుతోంది.

**జన్యు పాత్ర: కేవలం కుటుంబ చరిత్ర మాత్రమే కాదు**

జన్యు అంశాలు అంటే తప్పనిసరిగా కుటుంబంలో స్పష్టమైన క్యాన్సర్ చరిత్ర ఉండాలనే అర్థం కాదు. కొంతమంది రోగులకు దగ్గరి బంధువుల్లో థైరాయిడ్ వ్యాధులు లేదా క్యాన్సర్ ఉన్నా, మరికొందరికి అలాంటి సమాచారం ఉండకపోవచ్చు. కొన్ని జన్యు మార్పులు తరతరాలుగా ఎటువంటి స్పష్టమైన సంకేతాలు ఇవ్వకుండా నిశ్శబ్దంగా కొనసాగుతాయి.

భారతదేశంలోని ఎండోక్రైన్ క్యాన్సర్లపై పరిశోధనలు చేస్తున్న సంస్థలు, కొన్ని ప్రత్యేక జన్యు మార్పులు థైరాయిడ్ కణాలు ఎలా పెరుగుతాయో, ఎలా విభజించబడతాయో ప్రభావితం చేస్తాయని గుర్తించాయి. ఈ జన్యువులు సరిగా పనిచేయకపోతే, కణాలు నియంత్రణ లేకుండా పెరిగి చివరికి క్యాన్సర్‌గా మారవచ్చు.

కొన్ని వారసత్వ జన్యు సిండ్రోములు, ముఖ్యంగా మెద్యులరీ థైరాయిడ్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ఇలాంటి సందర్భాల్లో, ఈ వ్యాధి చిన్న వయసులోనే కనిపించవచ్చు మరియు ఒకే కుటుంబంలోని పలువురిని ప్రభావితం చేయవచ్చు. అటువంటి కుటుంబాల్లో ముందస్తు జన్యు స్క్రీనింగ్ ప్రాణాలను కాపాడగలదు, లక్షణాలు కనిపించకముందే నివారణ చర్యలు తీసుకునే అవకాశం ఇస్తుంది.

**అకస్మాత్తు జన్యు మార్పులు: పెరుగుతున్న ఆందోళన**

ప్రతి జన్యు మార్పు వారసత్వంగా రావాల్సిన అవసరం లేదు. కొన్ని మార్పులు వ్యక్తి జీవితకాలంలో స్వయంగా ఏర్పడతాయి. వీటిని స్పొరాడిక్ మ్యూటేషన్లు అంటారు. భారతదేశంలో నిర్ధారణ అవుతున్న అనేక థైరాయిడ్ క్యాన్సర్ కేసుల్లో ఇవి ఎక్కువగా గుర్తించబడుతున్నాయి.

పర్యావరణ ప్రభావాలు, దీర్ఘకాలిక థైరాయిడ్ సమస్యలు, ముఖ్యంగా చిన్న వయసులో వైద్య చికిత్సల సమయంలో జరిగిన రేడియేషన్ ఎక్స్‌పోజర్ వంటి అంశాలు ఈ జన్యు మార్పులకు కారణమవుతాయి. ప్రభుత్వ మద్దతుతో జరిగిన భారతీయ పరిశోధనల ప్రకారం, ఈ మార్పులు క్యాన్సర్ ఎంత దూకుడుగా ఉంటుందో, చికిత్సకు ఎలా స్పందిస్తుందో నిర్ణయిస్తాయి.అందుకే, ఒకేలా కనిపించే నిర్ధారణ ఉన్న ఇద్దరు రోగులకు ఫలితాలు పూర్తిగా భిన్నంగా ఉండవచ్చు.


**చికిత్సలో జన్యు అవగాహన ఎందుకు కీలకం?**

జన్యు అవగాహన థైరాయిడ్ క్యాన్సర్ చికిత్స విధానాన్ని పూర్తిగా మార్చుతోంది. కేవలం ట్యూమర్ పరిమాణం లేదా వ్యాప్తి ఆధారంగా కాకుండా, ఇప్పుడు క్యాన్సర్ జన్యు ప్రవర్తనను కూడా వైద్యులు పరిశీలిస్తున్నారు.

**భారతీయ ఆంకాలజీ మార్గదర్శకాలు**, కొన్ని జన్యు మార్పులు నెమ్మదిగా పెరిగే క్యాన్సర్‌ను సూచిస్తాయని, మరికొన్ని మరింత గట్టి పర్యవేక్షణ లేదా తీవ్ర చికిత్స అవసరమని తెలియజేస్తాయని గుర్తిస్తున్నాయి. ఇది ముఖ్యంగా యువ రోగులు మరియు పని చేసే వయసు గలవారికి, అధిక లేదా తక్కువ చికిత్సల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.కేర్ గివర్లకు ఇది స్పష్టతను ఇస్తుంది. చికిత్స నిర్ణయాలు భయంపై కాకుండా, వ్యాధి ప్రవర్తన ఆధారంగా తీసుకోవచ్చనే నమ్మకాన్ని కలిగిస్తుంది.

**కుటుంబాలు ఆందోళన చెందాలా?**

జన్యు సంబంధం ఉందని అంటే తప్పనిసరిగా క్యాన్సర్ వస్తుందనే కాదు. కానీ అవగాహన చాలా ముఖ్యం.థైరాయిడ్ క్యాన్సర్ కుటుంబ చరిత్ర, బహుళ ఎండోక్రైన్ రుగ్మతలు, లేదా చిన్న వయసులో నిర్ధారణలు ఉన్న కుటుంబాలు జన్యు కౌన్సెలింగ్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. భారతదేశంలోని అనేక ప్రభుత్వ వైద్య కళాశాలలు మరియు ప్రభుత్వ ఆసుపత్రులు ఇప్పుడు ఈ సేవలను అందిస్తున్నాయి.ఇతరుల కోసం సందేశం చాలా సరళం: శరీర సంకేతాలను నిర్లక్ష్యం చేయవద్దు. మెడలో గడ్డ, గొంతుస్వరం మారడం, లేదా



మింగడంలో ఇబ్బంది వంటి లక్షణాలు నొప్పి లేకపోయినా గమనించాలి.

**ఆందోళన కాదు, అవగాహన ద్వారా నివారణ**

జన్యువులను మార్చలేం, కానీ ఫలితాలను మార్చవచ్చు. థైరాయిడ్ క్యాన్సర్‌కు వ్యతిరేకంగా ముందస్తు గుర్తింపే అత్యంత బలమైన ఆయుధం. ప్రారంభ దశలో గుర్తిస్తే, చాలా థైరాయిడ్ క్యాన్సర్లు పూర్తిగా చికిత్స చేయదగినవే, రోగులు సాధారణ జీవితానికి తిరిగి రావచ్చు.

భారతదేశంలోని ప్రజారోగ్య సర్వేలు చూపుతున్నదేమిటంటే, చికిత్సకు ప్రాప్యత లోపం కన్నా అవగాహన లోపమే ప్రధాన అడ్డంకి. భయం లేదా అపోహలు లేకుండా జన్యు ప్రమాదంపై మాట్లాడటం ముందడుగు.

**రోగులు మరియు కేర్ గివర్లకు ముఖ్యమైన సందేశం**

థైరాయిడ్ క్యాన్సర్ ఇక యాదృచ్ఛికంగా వచ్చే వ్యాధి మాత్రమే కాదు. ఎవరికీ వస్తుంది, ఎలా ప్రవర్తిస్తుంది, ఎలా చికిత్స చేయాలి అన్న విషయాల్లో జన్యువులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ అవగాహన కుటుంబాలను శక్తివంతం చేస్తుందిముందుగానే చర్యలు తీసుకోవడానికి, సరైన ప్రశ్నలు అడగడానికి, సరైన సమయంలో సరైన చికిత్స పొందడానికి.



డా. ఆర్.వి. రఘునానన్,
సీనియర్ కన్సల్టెంట్
రేడియేషన్ ఆంకాలజీ

# ప్రీ-క్యాన్సర్ గాయాలు మరియు ప్రారంభ చికిత్సలపై అవగాహన


క్యాన్సర్ నిర్ధారణ ఎల్లప్పుడూ అకస్మాత్తుగా రావాల్సిన అవసరం లేదు. చాలా సార్లు, క్యాన్సర్ ఏర్పడే ముందు శరీరం కొన్ని సంకేతాలను ఇస్తుంది. చిన్న స్థాయిలో కణాల మార్పులు నొప్పి లేదా స్పష్టమైన లక్షణాలు లేకుండానే, క్యాన్సర్‌గా మారే ముందు ఎన్నో సంవత్సరాల క్రితమే ప్రారంభమవుతాయి. ఈ ప్రారంభ మార్పులను ప్రీ-క్యాన్సర్ గాయాలు అంటారు. ఇవి క్యాన్సర్ కావు. కానీ ఇవి హెచ్చరికలుగా పరిగణించాలి. వీటిని తొందరగా గుర్తిస్తే, క్యాన్సర్‌గా మారే ప్రక్రియను పూర్తిగా అడ్డుకునే అవకాశం ఉంటుంది.

భారతదేశంలో, ఇంకా చాలామంది క్యాన్సర్‌ను తప్పించుకోలేని వ్యాధిగా భావిస్తున్న పరిస్థితుల్లో, ప్రీ-క్యాన్సర్ పరిస్థితులపై సరైన అవగాహన కొరవడింది. రోగులు మరియు కేర్ గివర్లకు ఈ పదం భయాన్ని కలిగించ వచ్చు. కానీ ఈ ముందస్తు హెచ్చరికలను అర్థం చేసుకోవడం భయాన్ని తొలగించి, ఆలస్యం స్థానంలో సరైన నిర్ణయాలకు దారి తీస్తుంది.

**ప్రీ-క్యాన్సర్ గాయాలు అంటే ఏమిటి? :**ప్రీ-క్యాన్సర్ గాయాలు అనేవి కణాల్లో ఏర్పడే అసాధారణ మార్పులు. వీటిని నిర్లక్ష్యం చేస్తే, కాలక్రమేణా క్యాన్సర్‌గా మారే అవకాశముంది. ఇవి శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించవు. చాలా సందర్భాల్లో, ఇవి ఇకపై ముందుకు వెళ్లకపోవచ్చు. అయితే కొన్ని గాయాలు వాటి స్థానం, రకం, మరియు కొనసాగుదల ఆధారంగా నెమ్మదిగా క్యాన్సర్‌గా అభివృద్ధి చెందవచ్చు. ఈమార్పులు సాధారణంగా గర్భాశయ సర్విక్స్, నోటి లోపలి భాగం, వక్షోజాలు, చర్మం, మరియు జీర్ణాశయ మార్గం వంటి ప్రాంతాల్లో కనిపిస్తాయి. చాలా సందర్భాల్లో, ఇవి సాధారణ స్క్రీనింగ్ పరీక్షల సమయంలో లేదా ఇతర లక్షణాల కోసం చేసిన పరీక్షల్లో గుర్తించబడ తాయి. ఇవి క్యాన్సర్ నిర్ధారణ కాదు, కానీ శరీరం జాగ్రత్త కావాలని ఇచ్చే హెచ్చరిక.

**ఈ మార్పులు ఎందుకు జరుగుతాయి?**

ప్రీ-క్యాన్సర్ గాయాలు ఒక్కసారిగా ఏర్పడవు. ఇవి సాధారణంగా దీర్ఘకాలిక రోషం లేదా ప్రమాద కారకాల ప్రభావం వల్ల ఏర్పడతాయి. భారతీయ పరిస్థితుల్లో, పొగాకు వినియోగం ఏ రూపంలో అయినా, అధిక మద్యం సేవనం, దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్లు, స్థిరమైన వాపు, పోషకాహార లోపం, మరియు ఎక్కువకాలం ఎండకు గురికావడం వంటి అంశాలు ప్రధాన కారణాలుగా ఉంటాయి.యువతలో పెరుగుతున్న జీవనశైలి మార్పులుశారీరక చురుకుదనం లేకపోవడం, అసమయ భోజనాలు, ఒత్తిడి, మరియు ఆరోగ్య పరీక్షలను వాయిదా వేయడంకూడా ప్రమాదాన్ని పెంచుతున్నాయి. మహిళల్లో హార్మోన్ల ప్రభావం మరియు క్రమం తప్పని స్క్రీనింగ్ లేకపోవడం ఆలస్యమైన గుర్తింపుకు



ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ అంశాలు ఒక్కటే వ్యాధికి కారణం కాకపోయినా, కాలక్రమేణా కలిసిప్పుడు శరీరాన్ని బలహీనంగా మారుస్తాయి.

**ఆలస్యం చేసే మౌన ప్రమాదం :** ప్రీ-క్యాన్సర్ గాయాలతో ఉన్న అతిపెద్ద సవాల్ అవి మౌనంగా ఉండడమే.చాలా సందర్భాల్లో నొప్పి ఉండదు. కొన్ని సంద ర్భాల్లో స్వల్ప అసౌకర్యం, మచ్చలు, లేదా చిన్న మార్పులుగా కనిపించవచ్చు వాటిని సులభంగా పట్టించుకోకుండా వదిలేయవచ్చు. ముఖ్యంగా కుటుంబ బాధ్యతలు ఎక్కువగా ఉన్న కేర్ గివర్లు తమ ఆరోగ్యాన్ని చివరికి పెట్టే సందర్భాల్లో, ఈ ప్రారంభ లక్షణాలు చిన్నవిగా భావించి నిర్లక్ష్యం చేయబడతాయి.ఈ ఆలస్యం వల్ల అసాధారణ కణాలు ముందుకు సాగుతాయి. ఒకప్పుడు సులభమైన చికిత్సతో నియంత్రించగలిగిన సమస్య, తరువాతి దశల్లో క్లిష్టమైన చికిత్స అవసరమయ్యే స్థితికి చేరవచ్చు. తొందరగా వైద్య దృష్టి పెట్టడం అంటే దూకుడైన చికిత్స కాదుఅది చాలాసార్లు సులభమైన, సురక్షితమైన పరిష్కారాలను సూచిస్తుంది.

**ప్రీ-క్యాన్సర్ గాయాలను ఎలా గుర్తిస్తారు?:** గుర్తింపు ప్రధానంగా అవగాహన మరియు స్క్రీనింగ్‌పై ఆధారపడి ఉంటుంది. క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, వయస్సుకు అనుగుణమైన స్క్రీనింగ్‌లు, మరియు కొనసాగుతున్న లక్షణాలపై వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. విజువల్ పరీక్షలు, ఇమేజింగ్, సైటాలజీ టెస్టులు, బయాప్సీలు, లేదా ఎండోస్కోపీ వంటి పరీక్షల ద్వారా వైద్యులు కణాల మార్పులను ఖచ్చితంగా గుర్తించగలరు. భారతీయ వైద్య అధ్యయనాలు మరియు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు స్పష్టంగా సూచిస్తున్నది ఏమిటంటేతొందరగా స్క్రీనింగ్ చేయించుకుంటే సమయానికి చికిత్స లభించి, జీవన నాణ్యత మెరుగవుతుంది. ఈ ప్రక్రియ సాధారణంగా వేగంగా, వ్యవస్థీకృతంగా, మరియు తక్కువ అసౌకర్యంతో పూర్తవుతుంది.

**ప్రారంభ చికిత్స**: సమయోచితమైనది, లక్ష్యితమైనది, ప్రభావవంతమైనది ప్రీ-క్యాన్సర్ గాయాల చికిత్స వాటి రకం, స్థానం, మరియు తీవ్రతపై ఆధారపడి ఉంటుంది. చాలా సందర్భాల్లో, అసాధారణ కణాలు ముందుకు సాగకముందే వాటిని తొలగించడం లేదా నాశనం చేయడమే చికిత్స లక్ష్యం. దీనికి చిన్న శస్త్రచికిత్సలు, స్థానిక చికిత్సలు, లేదా జీవనశైలి మార్పులతో కూడిన పర్యవేక్షణ అవసరమవుతుంది.అంతే కాకుండా, మూలకారణాన్ని పరిష్కరించడం కూడా చాలా ముఖ్యంపొగాకు మానేయడం, ఇన్ఫెక్షన్లకు చికిత్స, పోషకాహార మెరుగుదల, లేదా ఒత్తిడి నియంత్రణ వంటి చర్యలు కీలకం. ప్రారంభ చికిత్స సాధారణంగా జీవితాన్ని అస్తవ్యస్తం చేయదు. ఇది అత్యంత ప్రభావవంతమైన దశలో ఇచ్చే నివారణాత్మక సంరక్షణ.

**నివారణ ఇంటి నుంచే ప్రారంభమవుతుంది:** నివారణలో కేర్ గివర్లు కీలక పాత్ర పోషిస్తారు. క్రమం తప్పని పరీక్షలను ప్రోత్సహించడం, ప్రారంభ లక్షణాలను గుర్తించడం, మరియు ఆరోగ్యకరమైన అలవాట్లకు మద్దతు ఇవ్వడం దీర్ఘకాలిక మార్పును తీసుకురాగలదు. సమతుల్య ఆహారం, శారీరక వ్యాయామం, హానికర పదార్థాల నివారణ, మరియు స్క్రీనింగ్ షెడ్యూల్‌ను పాటించడం కాలక్రమేణా బలమైన రక్షణను నిర్మిస్తాయి.ప్రత్యేకంగా మహిళలు మరియు వృద్ధుల మధ్య ఆరోగ్యంపై తెరవెనుక సంభాషణలు జరగడం సంకోచం మరియు అపోహలను తగ్గిస్తుంది. ముందుగానే వైద్య సలహా తీసుకోవడం భయంగా కాకుండా బాధ్యతగా చూడాలి.

**భరోసా ఇచ్చే సందేశం :**

ప్రీ-క్యాన్సర్ గాయాలు తీర్పు కావుఅవి ఒక అవకాశం. ఇవి తొందరగా గుర్తించబడితే, వ్యాధి నియంత్రణలోకి వచ్చే ముందు వైద్యులు మరియు కుటుంబాలు చర్యలు తీసుకోగలరు.



డా. మురళీధర్ బోరా,
రేడియేషన్ ఆంకాలజిస్ట్,
హెచ్ సిజీ క్యాన్సర్ సెంటర్,
విశాఖపట్నం



# అమోఘం మాఘపున్నం

## అద్భుతమైన రోజు.. మాఘ పౌర్ణమి

## 100 ఏళ్ల తర్వాత వచ్చే అరుదైన యోగం!

**తెలుగు మాసాల్లో ప్రతి నెలకూ ఓ ప్రత్యేకత ఉంటుంది. కార్తీక మాసం దీపారాధనకు ప్రసిద్ధ అయినట్లే.. మాఘ మాసం పవిత్ర స్నానాలకు ప్రసిద్ధి. అదేవిధంగా హిందూ సంప్రదాయంలో ప్రతి పండుగకు కూడా ఒక ప్రత్యేకత ఉంటుంది. అలాగే పౌర్ణమి తిథికి, అమావాస్య తిథికి కూడా ప్రత్యేక విశిష్టత ఉంది. ఈ నేపథ్యంలో మాఘమాసంలో వచ్చే పౌర్ణమి తిథిని మాఘ పూర్ణిమ అంటారు. ఈ మాఘ పౌర్ణమి రోజు విష్ణుమూర్తిని పూజిస్తారు. అయితే.. ఈ ఏడాది వచ్చే మాఘ పూర్ణిమ 2026 వేళ పాటించాల్సిన పరిహారాలను తెలుసుకుందాం..**

చైత్రాది పన్నెండు మాసాలకూ ఏదో ఒక ప్రత్యేకత వుంది. కార్తీక మాసం దీపాలకూ, దీపారాధనలకు ప్రసిద్ధి. మాఘమాసం పవిత్ర స్నానాలకు ప్రసిద్ధి.

మా – అఘం అంటే పాపం యివ్వనిది అని అర్థం. కనుకనే మాఘమాసం అన్నారు.

**మాఘమాసేరటం తాప్యః కించి దభ్యుదితే రవౌ**
**బ్రహ్మఘ్నం వా సురాపం వా కంపతంతం పునీమహే**

ఈ మాఘమాసమందు సూర్యోదయమునకు పూర్వమే, అనగా ... బ్రాహ్మీముహూర్తము నుంచి జలములన్నియు బ్రహ్మహత్య, సురాపానము వంటి మహా పాతకములను పోగొట్టిమానవులను పవిత్రులుగా చేయుటకు సంసిద్ధముగా వుండును అని అర్థం.

మాఘ మాసంలో వచ్చే పౌర్ణమి తిథిని మాఘ పౌర్ణమిగా పిలుస్తారు. హిందూ సంప్రదాయంలో ఈ మాఘ పౌర్ణమి రోజుకు విశిష్టమైన స్థానం ఉంది. ఈ ఏడాది 2026వ సంవత్సరంలో ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం రోజు మాఘ పౌర్ణమిని భక్తి శ్రద్ధలతో ఆచరించనున్నారు. ఈ పవిత్రమైన రోజున శ్రీమహావిష్ణువుకు, శివుడికి, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, వ్రతాలు ఆచరిస్తారు. దానధర్మాలు చేస్తారు. ఎంతో పవిత్రమైన మాఘ మాసంలో వచ్చే పౌర్ణమి తిథి విశిష్టమైన దైవిక శక్తిని కలిగి ఉంటుందని ప్రగాఢ విశ్వాసం.

మఘా నక్షత్రంలో చంద్రుడి సంచారాన్ని మాఘ పౌర్ణమి గా జరుపుకుంటారు. ఈ ఏడాది మాఘ పౌర్ణమి 2026 ఫిబ్రవరి 1వ తేదీన ( జరుపుకోనున్నారు. ఈ ఏడాది వచ్చే మాఘ పౌర్ణమి అరుదైన యోగంతో రానుందట. అయితే ఎప్పుడైనా మఘ నక్షత్రం చంద్రుడు ఉన్నప్పుడు పౌర్ణమి రోజు చేసే పరిహారం అపమృత్యు దోషం నుంచి కాపాడుతుందట. అలాగే ఆయుష్షును పెంచుతుందట. అలాగే మిగతా గ్రహాలన్నీ ఒక్కొక్కటి మకర రాశి నుంచి కుంభరాశిలోకి వెళుతున్నాయి. ఫిబ్రవరిలో చూస్తే పంచగ్రహ కూటమి 12 నుంచి 15 రోజులు ఉంటుంది. అయితే.. మాఘ పౌర్ణమి రోజు ఎవరైతే సూర్యుడిని, అమ్మవారిని ప్రార్థిస్తారో.. వారికి ఆయుష్షు పెరగడంతో పాటు మానసిక రుగ్మతలు, ఆరోగ్య సమస్యలు తొలగుతాయి.

పుణ్య నదుల్లో ఏడాదంతా నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. పురాణాల ప్రకారం మాఘమాసం ఎంతో విశిష్టమైనది. ఇక మాఘ పౌర్ణమి రోజున నదులు, గుడి లోని కోనేరులు కూడా ఈ రోజున (2026 ఫిబ్రవరి 1) పవిత్రతను సంతరించుకుంటాయని నమ్మకం. ఈ నెలలో పుణ్యనదుల్లో సకల దేవతలు సంచరిస్తుంటారని పండితులు చెబుతున్నారు.

### నదీజలాల్లో దేవతలు ..

మాఘ మాసంలో సర్వశక్తులు.. తేజస్సులను ఉంచుతారు. అందువలన మాఘ పౌర్ణమి రోజున నదీ స్నానం చేయాలని పండితులు చెబుతున్నారు. అలా అవకాశం లేనివారు బావుల దగ్గర కాని.. చెరువుల దగ్గర కాని.. కుళాయిల దగ్గర కాని స్నానం చేసినా అలాంటి ఫలితమే దక్కుతుందని పం డితులు చెబుతున్నారు. మాఘమాసంలో పుణ్య నదుల్లో స్నానం చేస్తే ఆరేళ్ల పాటు మంత్ర సంకల్ప స్నాన ఫలం లభిస్తుందని శాస్త్రాల ద్వారా తెలుస్తుంది. నదీ స్నానానికి వెళ్లలేని వారు బావి దగ్గర కాని.. బోరు దగ్గర కాని.. వాటర్ ట్యాంక్ ల దగ్గర గాని నదుల పేర్లు చెప్పుకుంటూ స్నానం చేయాలి. మాఘ స్నానం లో దివ్య తీర్థాలను స్మరించి పాపవినాశనం కోరుతూ స్నానం చేయడం సంప్రదాయం. స్నాన సమయంలో ప్రయాగను స్మరిస్తే ఉత్తమ ఫలం లభిస్తుంది.

### మాఘపూర్ణిమ – మహామాఘి :

మాఘమాసం స్నానాలకు ప్రసిద్ధి అని చెప్పుకున్నాం కదా! నిజానికి మకర సంక్రమణం జరిగినది మొదలు కుంభసంక్రమణం జరిగేవరకు మధ్య ఉండే మధ్యకాలమే మాఘమాసం. పవిత్రస్నానాలు పౌష్య శుక్ల పూర్ణిమతో మొదలై మాఘశుక్ల పూర్ణిమటో ముగుస్తాయి. చాంద్రమానం అనుసరించేవారికి ఈ మాఘమాసం పౌష్య బహుళ అమావాస్యతో ప్రారంభమై మాఘ బహుళ అమావాస్యతో ముగుస్తుంది. ఈ మాఘమాసం మొత్తం పవిత్రస్నానాలు చేయడం విశేష పూర్వప్రదం. కానీ, ఈ యాంత్రిక జీవితంలో అది సాధ్యం కానీ పని తెలిసే ... కనీసం మాఘపూర్ణిమ నాడైనా నదీస్నానం గానీ, సముద్రస్నానం గానీ చేస్తే మాఘమాసం మొత్తం పవిత్రస్నానాలు చేసిన ఫలితం వస్తుందని పెద్దలంటారు. ఎందుకంటే మాఘపూర్ణిమను మహామాఘి అని అంటారు. సంవత్సరంలో వచ్చే 12 పూర్ణిమలలోనూ మాఘ పూర్ణిమ అత్యంత విశేషమైనది. ఈ మహామాఘి శివ, కేశవులిద్దరికీ ప్రీతికరమైనది. అందుకే ఈ మాఘ పూర్ణిమ నాడు తప్పకుండా సమద్రస్నానం చేసితీరాలి. శివ, కేశవులిద్దరినీ ఆరాధించి తరించాలి.

### సముద్రస్నానం ఎందుకు చేయాలి?

**నదీనాం సాగరో గతి:**

సకల నదీ, నదాలు చివరకు సముద్రంతోనే సంగమిస్తాయి. కనుక, సముద్రస్నానం చేస్తే సకల నదులలోనూ స్నానం చేసిన పుణ్యఫలం దక్కుతుంది. ముఖ్యంగా సముద్రుడి ప్రత్యేకత ఏమిటంటే ... ప్రతినిత్యం సూర్యకిరణాలవల్ల, ఎంతో నీరు ఆవిరి అవుతున్నా సముద్రం యొక్క పరిమాణం తగ్గదు. అలాగే, ఎన్నో జీవనదులు తనలో కలుస్తున్నా సాగరుని పరిమాణం పెరగదు. స్థిరత్వం ఆయన ధర్మం.

### అఘాది, జడత్వాలు ఆయన తత్త్వం.

సాగరుడు సంతోశప్రదుడు. సంవత్సరంలో నాలుగుసార్లు సాగరస్నానం చేయాలనీ, అవి కూడా ఆషాఢ పూర్ణిమ, కార్తీక పూర్ణిమ, మాఘపూర్ణిమ, వైశాఖ పూర్ణిమలలో చేయాలని, ఆలా సాగరస్నానాలు చేసినవారికి సముద్రుడు సంపూర్ణ ఆరోగ్యం కలుగజేస్తాడని పురాణాలు చెప్పాయి. స్నానం అంటే షవర్ బాత్ చేయడమో, స్విమ్మింగ్ పూల్‌లో చేయడమో కాదు. నదీప్రవాహ వేగానికి ఎదురుగా నడుము మునిగే వరకూ నిలబడి, కనీసం 48 నిమిషాల పాటు స్నానం చేయాలని విధి. అది కూడా సూర్యోదయానికి గంటన్నర ముందు కాలంలోనే చేయాలి. ఏమిటీ ఛాదస్తం అని విసుక్కోవద్దు. ఛాదస్తం కాదు, సైన్స్. నీటిలో విద్యుచ్ఛక్తి ఉందని సైన్సు చెబుతుంది. కానీ ఈ సైన్సు పుట్టుక ముందే ఈ సత్యాన్ని గుర్తించిన మన మహర్షులు బ్రాహ్మీ ముహూర్తాన్ని నదీస్నానానికి అనుకూల సమయంగా నిర్ణయించారు.



సూర్యోదయకాలం నుంచి, సూర్యాస్తమయం వరకూ ప్రసరించే సూర్యకిరణా లలోని విద్యుచ్ఛక్తిని నదీజలాలు, సాగర జలాలు తమలో నిక్షిప్తం చేసుకుం టాయి. తన వెండి వెలుగులతో జగతిని జ్యోత్స్నామాయం చేసే చంద్రుడు తన కిరణాలలోని అమృతత్వాన్ని, ఔశదీ విలువలను నదీజలాలకు అనుగ్రహిస్తాడు. నీటిలో వుండే ఈ అద్భుతశక్తులు ... తిరిగి సూర్యకిరణాలకు పరావర్తనం చెంది అంతరించి పోతాయి. అందుకే సూర్యోదయానికి పూర్వమే స్నానం పూర్తి చేయాలనే నియమాన్ని విధించారు పెద్దలు. మరి నడుము మునిగే వరకూ ఎందుకు నదీ ప్రవాహ వేగానికి ఎదురుగా ఎందుకు నిలబడాలి అన్న సందేహం రావచ్చు. గర్భస్థ శిశువుగా ఉన్న పిండానికి నాభినాళం ద్వారానే జీవశక్తులు అన్దుతాయన్నది ఎవరూ కాదనలేని సత్యం. సాగర, నదీజలాలలో నిక్షిప్తమై వున్నా సౌరశక్తి, సోమశక్తులు, ఈ నాభినుంచి శరీరం గ్రహిస్తుంది. అందుకే నాభి మునిగే వరకూ నదిలో నిలబడి స్నానం చేయాలి. సముద్రానికి ప్రవాహం లేకపోయినా, ఉత్తుంగ తరంగాలు తమ తాకిడితో ఆ శక్తులను శరీరానికి అందజేస్తాయి. కనుకనే సముద్రుణ్ణి పూజిస్తూ చేసే నాలుగు స్నానాలలో మాఘ పూర్ణిమ స్నానం ముఖ్యమైనది. సముద్రం, నదులు అందుబాటులో లేనివారి పరిస్థితి ఏమిటి? అనే సందేహం కలుగుతుంది. అలాంటి పరిస్థితిలో బావుల దగ్గరగానీ, చెరువుల వద్దగానీ గంగ, సింధు, కావేరి, కృష్ణ, గౌతమి నదుల పేర్లు స్మరిస్తూ స్నానం చేస్తే ఆయా నదుల్లో స్నానం చేసిన ఫలితం వస్తుంది. దేనికైనా భక్తి ప్రధానం. అది లేనప్పుడు ఎన్నిసార్లు కాకిలా మునిగి, కర్రలా తేలినా ఫలితం శూన్యం.



**మాఘపూర్ణిమ స్నానఫలం :**

ఇంటిలోనే వేడినీళ్ళతో స్నానం చేస్తే ఆ సంవత్సరాలు శుభ్రంగా స్నానం చేసిన ఫలితం లభిస్తుంది.

-బావి నీళ్ళతో స్నానం చేస్తే, 12 సంవత్సరాల పుణ్యస్నాన ఫలితం వస్తుంది.

చెరువులో స్నానం చేస్తే 24 సంవత్సరాల పుణ్యస్నాన ఫలం లభిస్తుంది.

సాధారణ నదిలో స్నానం చేస్తే 96 సంవత్సరాల పుణ్యస్నానఫలం లభిస్తుంది.

పుణ్యనదీ జలాలలో స్నానం చేస్తే 9,600 సంవత్సరాల పుణ్యస్నానఫలం లభిస్తుంది. సంగమస్థానాలలో స్నానం చేస్తే 38,400 సంవత్సరాల పుణ్యస్నానఫలం లభిస్తుంది.

గంగానదిలో స్నానం చేస్తే 3 కోట్ల 84 లక్షల సంవత్సరాల పుణ్యస్నానఫలం లభిస్తుంది.

ప్రయాగలోని త్రివేణీ సంగమంలో స్నానం చేస్తే ... గంగా స్నానం వలన కలిగే ఫలితం కన్నా నూరురెట్లు అధికఫలం కలుగుతుంది.

సముద్రస్నానం చేస్తే వచ్చే పుణ్యఫలాన్ని చెప్పడానికి మాటలు చాలవు.

ఈ మాఘమాసం మొత్తం పవిత్రస్నానాలు చేయడానికి వీలు కుదరకపోతే, మాఘమాసం చివరి మూడు-రోజులైనా పవిత్రస్నానాలు చేస్తే మంచి ఫలాన్ని పొందవచ్చు. చివర మూడు స్నానాలనూ అంత్యపుష్కరిణీ స్నానాలు అంటారు.

సాధారణ స్నానం శరీర మలినాన్ని పోగొడితే, మాఘమాసం, మనసులోని మాలిన్యాన్ని పోగొట్టి మాధవుని సన్నిధికి చేరు-స్తుంది.

**మాఘమాసం చేస్తున్నప్పుడు :-**

**దుఃఖదారిద్యనాశాయ శ్రీవిష్ణోస్తోషణాయాచ**
**ప్రాతః స్నానం కరోమ్యద్య మాఘేపాపవినాశనం**
**మకరస్దే రవౌ మాఘే గోవిందాచ్యుత మాధవ**
**స్నానేనానేన మే దేవ యథోక్త ఫలదో భావ**

అని పఠించి, మౌనంగా స్నానం చేయాలి, అంటే దుఃఖములు, దారిద్ర్యము నశించుటకు పాపక్షయమగుటకు శ్రీవిష్ణుప్రీతి పూర్వకముగ ఈ పవిత్ర మాఘ స్నానము చేయుచున్నాను. కనుక ఓ గోవిందా! అచ్యుతా! మాధవా! ఈ స్నానమునకు యథోక్తఫలము అనుగ్రహించు అని అర్థం.

ఆ తరువాత ...

**సవిత్రే ప్రసవితే చ పరంథామ జలేమమ**
**త్వత్తేజసా పరిభష్టం పాపం యాటు సహస్రథా**

అని సూర్యునకు అర్ఘ్యప్రదానం చేయాలి. అంటే ఓ పరంజ్యోతి స్వరూపుడా! నీ తేజస్సుచే నా పాపములు సర్వము వేయి తునాతునకలుగా వ్రక్కలై ఈ జలములందు బడి నశించుగాక అని అర్థం. ఈ విధంగా మాఘస్నానం చేసిన తరువాత, పితృతర్పణాది నిత్యకర్మలు పూర్తిచేసుకుని, ఇష్టదైవాన్ని ఆరాధించాలి. ఆ తర్వాత, దానధర్మాలు చేయాలి. వస్త్రములు, కంబలములు దుప్పటిలు, పాదరక్షలు, గొడుగు, తైలము, నెయ్యి, తిలపూర్ణఘటము, బంగారము, అన్నము మొదలైనవి దానం చేస్తే మహాపుణ్యఫలం లభిస్తుంది. చేయగలితే సమర్ధత, అవకాశం ఉన్నవారు నేతితో తిలహోమం చేస్తే మరింత పుణ్యం కలుగుతుంది.

## శంఖు రూపంలో పార్వతీ దేవి..



మాఘపౌర్ణమి రోజున పార్వతితేవి భూమి మీద ఒక శంఖు రూపంలో పడి... దక్షప్రజాపతి చేయి సోకగానే బాలికగా మారిపోయిందని పండితులు చెబుతున్నారు. ఆ బాలికకు సతీదేవి అన్నపేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచుకున్నాడు దక్షుడు.

**స్నానం చేసిన తరువాత ఏంచేయాలంటే..**

స్నానం చేసిన తరువాత సూర్యభగవానుడికి అర్ఘ్యం ( దోసెళ్లతో నీటిని సూర్యభగవానుడికి చూపించి ఒక పళ్లెంలో విడవవలెను) సమర్పించాలి. వైష్ణవ ఆలయానికి గానీ, శివాలయానికి గానీ వెళ్లి దర్శనం చేసుకోవాలి. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించడమే కాకుండా శక్తిమేరకు దానధర్మాలు చేయాలి. దీని వల్ల జన్మజన్మలుగా వెంటాడుతున్న పాపాలు, దోషాలు నశిస్తాయని నమ్మకం.

**మాఘ పౌర్ణమి రోజు పాటించాల్సిన పరిహారాలు**

ఈ రోజున స్వయంపాకం దానం చేయడం, గోశాల దగ్గరకు వెళ్లి గోవులకు మేత వేయడం, వీలైనంత వరకు ధ్యానం చేయడం, తెల్లటి వస్త్రాలను దానంగా ఇవ్వడంతో పాటు మాఘ పౌర్ణమి రోజు క్షేత్ర దర్శనం అద్భుతమైన ఫలితాలను ఇస్తుంది. మరీ ముఖ్యంగా ఈ మాఘ పౌర్ణమి రోజు అమ్మవారి మంత్ర సాధన చేయడం విశిష్టమైన ఫలితాలను ఇస్తుంది. త్వరగా మంత్ర సిద్ధి జరుగుతుంది. పౌర్ణమి రోజున అమ్మవారి మంత్రాలతో పాటు గణపతి మంత్రాలను పఠించడం కూడా శుభ ఫలితాలను ఇస్తుంది.

మాఘ పౌర్ణమి రోజున బ్రహ్మ ముహూర్తంలో లేచి స్నానం చేసి పూజలు చేయడం అత్యంత పుణ్యఫలదాయకం. శ్రీమహావిష్ణువు ముందు నెయ్యి దీపం వెలిగించి, పంచామృతంతో అభిషేకం చేసి, తులసీదళాలు సమర్పించడం శ్రేష్ఠం. పాలు, పెరుగు, నెయ్యి, చక్కెర, తేనెతో తయారైన పంచామృతం సమర్పించడం వల్ల దైవ అనుగ్రహం లభిస్తుందని విశ్వాసం. అదేవిధంగా ఈ రోజున నువ్వులు, బెల్లం, పసుపు వస్త్రాలు, ధాన్యాలు వంటి వాటిని దానం చేయడం ద్వారా పుణ్యం కలుగుతుందని ఆధ్యాత్మికులు పేర్కొంటున్నారు. ఈ దానధర్మాలు ఆర్థిక అభివృద్ధితో పాటు సుఖసంపదలను పెంపొందిస్తాయని భక్తులు నమ్ముతున్నారు.

**తేదీ మరియు సమయం**

2026 ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 5 గంటల 52 నిమిషాలకు పౌర్ణమి తిథి ప్రారంభమై, ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 3 గంటల 38 నిమిషాలకు ముగుస్తుంది. అందువల్ల ఫిబ్రవరి 1నే మాఘ పౌర్ణమిగా ఆచరించనున్నారు. ఈ పవిత్ర తిథిలో శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాన్ని ఆచరించడం కూడా ఎంతో మంగళప్రదమని ప్రముఖ పండితులు సూచిస్తున్నారు. సత్యనారాయణ వ్రతం ద్వారా కుటుంబంలో శాంతి, శ్రేయస్సు, సౌభాగ్యం వృద్ధి చెందుతాయని చెబుతున్నారు

**వెంకటేశ్వర దాస్**
**సూర్య కల్చరల్ రిపోర్టర్ - విశాఖపట్నం**

## మాఘ పౌర్ణమి విశిష్టత

మునులలో అతి ప్రసిద్ధుడైన కపిల మహర్షి జన్మించింది కూడా మాఘ పౌర్ణమి రోజే. కేవలం మనకు మాత్రమే కాకుండా బౌద్ధులకు కూడా మాఘ పౌర్ణమి ప్రత్యేకమే.. బుద్ధుడు తాను త్వరలోనే నిర్యాణం చెందబోతున్నట్లుగా ఈ రోజునే ప్రకటించారట. అందుకని మాఘపౌర్ణమి రోజున బౌద్ధులు వారి మతగ్రంథాలైన త్రిపిటకాలను పారాయణ చేస్తుంటారు. ఈ పవిత్రమైన రోజున దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలు, దానధర్మాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మాఘ మాసం స్వయంగా పుణ్యమాసంగా భావించబడుతుంది. అలాంటి మాసంలో వచ్చే పౌర్ణమి మరింత దైవిక శక్తిని కలిగి ఉంటుందని భక్తుల విశ్వాసం.

పౌరాణిక కథనాల ప్రకారం మాఘ పౌర్ణమి రోజున దేవతలు స్వర్గలోకంనుంచి భూమిపైకి అవతరిస్తారని నమ్మకం ఉంది. వారు భూమికి వచ్చి పవిత్ర నదుల్లో స్నానం చేస్తారని పురాణాలు చెబుతున్నాయి. అందు వల్ల ఈ రోజున నదీస్నానం చేయడం అత్యంత పుణ్యప్రదంగా భావిస్తారు. ముఖ్యంగా గంగా, గోదావరి, కృష్ణ, నర్మద వంటి పవిత్ర నదుల్లో స్నానం చేస్తే పాపాలు నివృత్తి అవుతాయని విశ్వసిస్తారు. నదీస్నానం సాధ్యంకాని వారు ఇంట్లోనే పవిత్రస్నానం ఆచరించి, భగవంతుని స్మరించుకోవచ్చు.

మాఘ పౌర్ణమి రోజున శ్రీమహావిష్ణువు, మహాలక్ష్మీదేవిని ఆరాధించడం అత్యంత శుభప్రదంగా పరిగణించబడుతుంది. సాధారణంగా ప్రతి పౌర్ణమి రోజున విష్ణు-లక్ష్మి పూజ చేయడం సంప్రదాయం. అయితే మాఘ పౌర్ణమి రోజున చేసే పూజలకు మరింత విశేష ఫలితాలు లభిస్తాయని ఆధ్యాత్మిక పండితులు చెబుతున్నారు. ఈ రోజు భక్తితో శ్రీమహావిష్ణువుకు పూజలు చేస్తే



జీవితంలో శుభకాలం ప్రారంభమవుతుందని, ఆర్థిక స్థిరత్వం కలుగుతుందని నమ్మకం. లక్ష్మీ కటాక్షం లభించి కుటుంబంలో ఐశ్వర్యం, సుఖసంతోషాలు పెరుగుతాయని విశ్వసిస్తారు.

అలాగే మఖ నక్షత్రం వచ్చినప్పుడు అమ్మవారిని పూజించడంతో పాటు పితృదేవతారాధన చేయడం అత్యంత శుభప్రదం. పితృదేవతారాధన వల్ల కలిగి ప్రయోజనం ఏమిటంటే.. జన్మయోగంలో పిశాచ యోగం పట్టడం, దోషాలు కలగడంతో పాటు ఇంట్లో ఉండే నెగిటివ్ ఎనర్జీ తగ్గి దేవతాశక్తి పెరుగుతుందట. ఇవి జరగాలంటే మాఘ పౌర్ణమి రోజు అమ్మవారి ఆరాధనతో పాటు పితృదేవతారాధన ఖచ్చితంగా చేయాలట. ముఖ్యంగా మఖ నక్షత్రం రోజు చేసే పితృదేవారాధన విశేషమైన ఫలితాలను ఇస్తుందని పండితులు చెబుతున్నారు. ఎందుకంటే మఖ నక్షత్రానికి పితృదేవతలను అధిదేవతలుగా చెబుతారు.

# విద్యార్థులకు ఐఎస్‌బి పీజీపీ వైఎల్ సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఆఫర్

విశాఖపట్నం 2026 ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ యంగ్ లీడర్స్ మొదటి బ్యాచ్ (20252027) లో 100% విద్యార్థులు వేసవి ఇంటర్న్‌షిప్ నియామకాలను విజయవంతంగా దక్కించుకున్నారు. కన్సల్టింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎఫ్ఎంసీజీ, టెక్నాలజీ, కంగ్లామరేట్ సంస్థలు, తయారీ, ఇతర రంగాలలో 38 కంపెనీల నుంచి 175కి పైగా సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఆఫర్‌లను విద్యార్థులు పొందారు. సగటున 11 నెలల ముందస్తు పని అనుభవంతో ఈ అవకాశాలను దక్కించుకున్న విద్యార్థుల ఈ బృందం సగటున 3.2 లక్షల స్టైపెండ్‌ను అందుకుంటుండగా, అత్యధిక స్టైపెండ్ 7.3 లక్షలు ఉంది. ఇది కెరీర్ ప్రారంభంలోనే నిపుణులకు అందించే విధుల నాణ్యత, బాధ్యతను నొక్కి చెబుతుంది. ఈ వేసవి ఇంటర్న్‌షిప్ ఆఫర్లు, రంగాలవారీగా విస్తృత స్థాయి నియామక భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుంది. కన్సల్టింగ్ రంగం 47% ఆఫర్లను అందించగా, తదుపరి స్థానాల్లో ఫైనాన్స్, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీలో 19%, ఎఫ్ఎంసీజీలో 11%, టెక్నాలజీలో 10%, కంగ్లామరేట్ సంస్థలలో 7% ఉన్నాయి. మిగిలిన 6% విధులు కార్యకలాపాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, తయారీ, వినియోగదారు సేవలు, లాభాపేక్షలేని సంస్థలలో సామాజిక ప్రభావానికి విస్తరించాయి.

వేసవి ఇంటర్న్‌షిప్ విధులు వ్యాపారం/వ్యూహ కన్సల్టింగ్, వ్యాపార వ్యూహం, జనరల్ మేనేజ్‌మెంట్, బ్రాండ్ మార్కెటింగ్, ఉత్పత్తి నిర్వహణ (టెక్నాలజీ), ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ (టెక్నాలజీ) & ట్రాన్స్‌ఫర్మేషన్, జనరల్ ఫైనాన్స్, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ, సేల్స్ మేనేజ్‌మెంట్, కార్యాచరణ తదితర రంగాలకు విస్తరించి ఉన్నాయి.

మొదటి బ్యాచ్ వేసవి ఇంటర్న్‌షిప్ సీజన్ ఫలితం అనేది చక్కగా తీర్చిదిద్దిన టీచింగ్ విధానానికి అద్దం పడుతుంది. ఇది వాస్తవ ప్రపంచంలోని సంక్లిష్ట వ్యాపార సమస్యలను పరిష్కరించడం ద్వారా లెర్నింగ్–ఆధారిత అభ్యాసాన్ని తెలియజేస్తుంది. లెర్నింగ్ ప్రయాణం విద్యార్థులకు విభిన్న పని పరిస్థితుల్లో ఆచరణాత్మక అనుభవాన్ని పొందేందుకు విస్తృత అవకాశాలను అందిస్తుంది. ఇందులో డిజైన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ యాక్షనబుల్ సొల్యూషన్స్ () నుంచి, ఆవిష్కరణలతో విద్యార్థులను నిజమైన సంస్థాగత సవాళ్లను ధీటుగా ఎదుర్కొనేలా, వినియోగదారు–కేంద్రీకృత, సమస్య–పరిష్కార మనస్తత్వాన్ని పెంపొందించే వ్యాపార డిజైన్ ల్యాబ్ వరకు ఉన్నాయి. ప్లాట్‌ఫామ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ వెంచర్ ఓరియెంటెడ్ థింకింగ్ () ద్వారా లెర్నింగ్ మరింత బలోపేతం అవుతుంది. ఇక్కడ విద్యార్థులు డిజైన్ థింకింగ్, అధునాతన వ్యాపార వ్యూహాలు, వినూత్న సాంకేతికతల సమగ్రతతో ఉపయుక్తం అయ్యే వ్యాపార నమూనాలు, కార్యాచరణ పరిష్కరణలను అభివృద్ధి చేస్తారు.

ఐఎస్‌బి అకడమిక్ ప్రోగ్రామ్స్ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ దీపా మణి మాట్లాడుతూ, "మొదటి వేసవి నియామకాల ఫలితాల అనేవి సరైన విద్యా పునాది, ఎక్స్‌పోజర్, ప్రతిభావంత యువ సంస్థలలో అర్థవంతమైన ప్రభావాన్ని చూపగలదనే మా నమ్మకాన్ని పునరుద్ఘాటిస్తోంది. రిక్రూటర్ల విస్తృతి, విధుల నాణ్యత ఐఎస్‌బీ బోధనా విధానం విద్యార్థులను నేరుగా కార్యాలయ పనితీరుకు అనువదించే నైపుణ్యాలతో ఎలా సన్నద్ధం చేస్తుందో ప్రదర్శిస్తుంది" అని వివరించారు.

20 నెలల పిజిపి వైఎల్ కార్యక్రమం ఇటీవలి గ్రాడ్యుయేట్లు, కెరీర్ ప్రారంభ నిపుణులకు వ్యాపారం, సాంకేతికత, నాయకత్వంలో బలమైన పునాదులను అందించేలా రూపొందించారు. అదే సమయంలో నిజమైన సంస్థాగత సెట్టింగ్‌లలో సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన నైపుణ్యాలను క్రమంగా నిర్మిస్తుంది. సగటు 23 ఏళ్ల వయస్సు ఉన్న మొదటి బ్యాచ్ కఠినమైన, అత్యంత పోటీతత్వ ప్రవేశ ప్రక్రియ ద్వారా ఎంపికైన అధిక సామర్థ్యం కలిగిన విద్యార్థులను కలిగి ఉంది. ఈ బ్యాచ్ గణనీయమైన వైవిధ్యాన్ని ప్రతిబింబించగా, 32% తాజా గ్రాడ్యుయేట్లు, మిగిలిన విద్యార్థులు పలు రంగాలలో 24 నెలల కన్నా తక్కువ పని అనుభవాన్ని పొందుతున్నారు. ఈ బ్యాచ్‌లో 50% మహిళలు ఉండగా, విద్యార్థులు భారతదేశంలోని అన్ని ప్రధాన ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, గొప్ప, సమగ్రమైన నైపుణ్యంతో లెర్నింగ్ వాతావరణాన్ని సృష్టించారు.

# సంతు రవిదాస్ మహారాజ్ స్ఫూర్తితో బహుజన రాజ్యాధికారం

భారతదేశ చరిత్ర గతిని మార్చిన గొప్ప సామాజిక సాంస్కృతిక రాజకీయ విప్లవకారులలో ప్రాథములు సంతు రవిదాస్ మహారాజ్, ఇతను ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వారణాసి జిల్లాలో గోవర్ధనపురి గ్రామంలో గంగ నది ఒడ్డున క్రీ.శ. సుమారు1400 సంవత్సరంలో సంతోష్ దాస్, కల్సిదేవి దంపతులకి జన్మించాడు.ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో మాఘ మాసం పౌర్ణమి నాడు సంతు రవిదాస్ జయంతిని భక్తి, చైతన్యంతో జరుపుకుంటారు.రవిదాస్ కి 12 వ ఏటా లోనదేవి తో వివాహం జరిగింది వీరికి విజయ్ దాస్ అనే కుమారుడు ఉన్నాడు. ఆనాటి నుండి నేటి వరకు భారతదేశ చరిత్రలో మనువాదానికి మాదిగల మానవత వాదానికి మధ్య నిరంతరం భావజాల సంఘర్షణ యుద్ధం జరుగుతూనే ఉంది బానిసత్వాన్ని సమర్థించే మనువాదానికి స్వేచ్ఛ సమానత్వం సోదరభావం కోరుకునే మాదిగ వాదానికి మధ్య సామరసత్య కురదరు. భారతదేశంలో పుట్టిన బౌద్ధాన్ని హింసాత్మక పద్ధతుల ద్వారా సర్వనాశనం చేసి నిచ్చెన మెట్ల కుల వ్యవస్థకి మనువాదులు ప్రాణం పోస్తే, ఈ అసమానతలను రూపుమాపడానికి జీవనదిల ప్రవహిస్తున్న మనువాదానికి అడ్డుకట్ట వేయడానికి గంగా నది ఒడ్డున చెప్పులు కుట్టే చమర్(మాదిగ) కులంలో పుట్టిన గొప్ప సామాజిక సాంస్కృతిక విముక్తి ఉద్యమ నిర్మాతనే సంతు రవిదాస్. మనువాదానికి అడ్డు అదుపు లేకుండా వ్యాపిస్తున్న చోట కుల, మతాలు లేవు మనుషులందరూ సమానమనే సిద్ధాంతంతో ఒక చమర్(మాదిగ) వ్యక్తి బోధనలు చేయడం మహా విప్లవమే. రవిదాస్ కంటే ముందు ఎందరో సంఘసంస్కర్తలు పనిచేసినప్పటికీ అట్టడుగు స్థాయి ఉండి వచ్చిన రవిదాస్ తీసుకొచ్చిన సిద్ధాంతం విప్లవాత్మకమైనదిగా చెప్పవచ్చు. ఎందుకంటే కుల వ్యవస్థ వల్ల ఈ సమాజంలో అత్యధికంగా బాధింప బడుతున్న ఆ సమాజం నుండే ఒక గొప్ప యోధుడు పుట్టడం మామూలు విప్లవంగా భావించక తప్పదు. బుద్ధుడు చెప్పిన విలువలకి సరి సమానంగా ఉంటాయి సంతు రవిదాస్ బోధనలు. బుద్ధుడు ఆనాడు తన బోధనలతో ఎందరో రాజులను మెప్పించి బుద్ధిజం తీసుకునేలా జ్ఞానబోధ చేస్తే సంతు రవిదాస్ మహారాజ్ కూడా తన కీర్తనల ద్వారా ఎందరో రాజులని తన మార్గంలో నడిచేలా నూతన సమాధర్మన్ని తీసుకొచ్చాడు. అస్పృశులు జ్ఞానార్జన, జ్ఞాన బోధ చేయడం తప్పని చెప్తుంటే వాటికి వ్యతిరేకంగా మనుషుల మధ్య ప్రేమ కరుణ మానవత్వం సమానత్వం స్వేచ్ఛ సోదరభావాలు ఉండడమే నిజమైన జ్ఞానమని సంతు రవిదాస్ చెప్పడం ఆనాటి మనువాద బ్రాహ్మణులకి మింగుడు పడక నాడు కాశీని పాలిస్తున్న రాజా నరేష్ జికి బ్రాహ్మణులు ఫిర్యాదు చేయడం వల్ల రాజా ధర్మం ప్రకారం సంతు రవిదాస్ ని శిక్షించమని రాజును ఆజ్ఞాపిస్తారు. కానీ సంతు రవిదాస్ తన జ్ఞాన బోధనలతో ఆ రాజుకి జ్ఞానోదయం చేసి తనకి అనుకూలంగా వశరచుకుంటాడు, ఇలా ఎందరో రాజులని మెప్పించి సంతు రవిదాస్ బ్రాహ్మణులకు ముచ్చమటలు పట్టించాడు. అంతేకాకుండా తనకు నచ్చిన మార్గంలో వెళ్తూ తన బోధనలు చెప్పుకునేలా ఎందరో రాజుల ద్వారా సంతు రవిదాస్ అవకాశాల్ని సృష్టించుకున్నాడు. మీరా బాయి , రాణి ఝూలా, రాజా పిపా , రాజా సికందర్ లోధి , గురునానక్ , రాజా బహదూర్ షా, రాణి రతన్ కున్వర్, రాజా నగర్ మాల్, పండిట్ శారదా రామ్, రాజా చందర్ పర్తాప్, బీబీ భన్మతి, పండిట్ గంగా రామ్, రామ్ లాల్, రాజా బైన్ సింగ్, రాణా సంగ , రాజా చంద్రహంస్, గురు కబీర్ , గురు తర్లోచన్, గురు సాధన సెహన్ ప్రముఖ ఎందరో రాజులు రాణులు సంత్ రావిదాస్ బోధనలకి ప్రభావితులయ్యి శిష్యులుగా ఉన్నారు.

దేవుడిని అడ్డుగా పెట్టుకొని మనువాద బ్రాహ్మణులు తీసుకొచ్చిన అసమానతలకు వ్యతిరేకంగా సంఘపరివర్తన ఒక ప్రాంతానికి సంబంధించిన విషయంగా భావించ కుండా దేవుడు నిరాకరుడని భావిస్తూ మనుషులంతా సమానమని చెప్తూ తన సామాజిక సాంస్కృతిక విప్లవాన్ని ఉత్తరప్రదేశ్, ఉత్తరభారతం దాటి దక్షిణ భారతాన్ని కూడా సంతు రవిదాస్ ప్రభావితం చేశాడు. తొలిసారి సంతు రవిదాస్ ఉత్తర భారతాన్ని సందర్శించినప్పుడు కబీరు, త్రిలోచన్, ధన్నాజీలు రవిదాసంతో కలిసి పర్యటించారు. హైదరాబాద్ ప్రాంతాన్ని రవిదాస్ సందర్శించినప్పుడు వారి తత్వాన్ని చమర్(మాదిగలు) స్వీకరించారు. నేటికీ హైదరాబాదులో లక్షల మంది అనుచరులు రవిదాస్ కి ఉండటం గమనార్హం. రవిదాస్ తను పుట్టిన కులాన్ని గొప్పగా భావిస్తూ తన తత్వంతో అనేకమంది రాజులను మెప్పిస్తూ మాదిగలని గొప్పవారిగా వారితో కూడా భావించేలా తన ప్రభావాన్ని చూపించగలిగాడు. రవిదాసు మంచి అందగాడు, ఆజానుబావుడు అపారమైన జ్ఞానశైలి తన స్వరంతో, తన కీర్తనలతో ప్రజలని వశపరచుకునేవాడు నాకు నీకు మధ్య నీకు నాకు మధ్య కులమత అడ్డుగోడలేంటి..? మనుషులందరూ సమానమే అని చెప్తూ మనువాద బ్రాహ్మణులకి ముచ్చెమటలు పట్టించేవాడు. 500 సంవత్సరాల క్రితం ఆర్య బ్రాహ్మణ వర్గానికి చెందిన తులసిదాస్ బ్రాహ్మణులు గుణహీనుడు జ్ఞానహీనుడు అయినప్పటికీ పూజించు కానీ శూద్రుడు చమార్ గుణవంతుడు జ్ఞానవంతుడు అయినప్పటికీ పూజించకు అంటే తులసీదాస్ తీసుకొచ్చేన సిద్ధాంతానికి అభిముఖంగా గుణశీలుడు జ్ఞానహీనుడు అయినా బ్రాహ్మణున్ని పూజించకు గుణ సంపన్నుడు జ్ఞాన సంపన్నుడు అయినా చమర్ పాదాలకు నమస్కరించు అని నూతన సిద్ధాంతాన్ని సంతు రావిదాస్ నిర్మించాడు. మనిషికి దేవుడి మధ్య ఉండే సంబంధం గురించి చెప్పడం కాదు పురోహితుడా మనిషికి మనిషికి మధ్య ఉండే సంబంధం ఏంటాని కుల వ్యవస్థను చీల్చి చెండాడి బ్రాహ్మణ పురోహిత వర్గంపై జ్ఞాన పంజని విసిరిన వాడు సంతూ రవిదాస్ తన న్యాయవాదన ప్రతిభతో రాజుల దర్బార్ లో బ్రాహ్మణులని రాజులని ఓడించి వారితోనే బంగారు కడియాన్ని తొడిగించుకొని వారిచేత కాళ్లు కడిగించుకున్న భారతదేశ చరిత్రలో తొలి మాదిగవాడు సంతు రవిదాస్. మాదిగ ధర్మం అంటే మానవ ధర్మమని మొట్టమొదసారి ప్రపంచం ముందు గర్జించిన జ్ఞాన సింహం సంతు రవిదాస్.చమర్(మాదిగ) అంటే ఆత్మ న్యూనతతో బ్రతకాకుండా నిరంతరం చైతన్యులుగా ఉంటూ మాదిగలు బతికితే సింహాసనం మీద కూర్చుంటూ స్వరాజ్యంలో బతకాలి, లేకుంటే స్మశానం లో ఉండాలని, అనగా అత్యల్ప శాతం ఉన్న అగ్రవర్ణల చేత అత్యధిక శాతం ఉన్న మాదిగలు మరియు బీసీ ఎస్టీ లు బాధితులుగా, పాలితులుగా ఉండడం కంటే చావడం మంచిది అంటూ విప్లవాత్మక సిద్ధాంతానికి పురుడు పోశాడు. మాదిగల నామ రూప గుణాల్లో మార్పు తీసుకొస్తూ మాదిగయేతారులైన బీసీ ఎస్టీ లని ప్రభావితం చేసి వారిలోని అనంతశక్తిని బయటికి తీసిన గొప్ప మానసిక శాస్త్రవేత్త సంతు రవిదాస్. తన జ్ఞానం గానామృతంతో జంబూద్వీప(భారతదేశ) ప్రజలందరినీ తన వెంట తిప్పుకున్న లోక రక్షకుడు సంతు రవిదాస్. దేవుడికి మనిషికి మధ్య పురోహిత బ్రాహ్మణుడు ఎందుకు అనే ప్రశ్నల ఫిరంగులను పేల్చి దేశంలోని బ్రాహ్మణ పూజారులని ఉక్కిరిబికిరి చేసిన గొప్ప పోరాట యోధుడు సంతు రావిదాస్. బ్రాహ్మణుడు క్షత్రియుడు వైశ్యుల కపట నాటక నిలయమే వారు కట్టించిన గుడి అని గుడి పునాదుల కింద భూకంపం సృష్టించి దేవుడు సర్వంతర్యామి అని చాటి చెప్పిన విప్లవకారుడు సంతు రావిదాస్. నాకు కావాల్సింది గుడి కాదు నా మాదిగల గుడి సే నాకు గుడి అని ప్రకటించిన తాత్వికుడు,మహాబాటసారి సంతు రవిదాస్. ఏ అడ్డంకులు లేకుండా ముందుకు వెళుతున్న సంతు రవిదాస్ తత్వానికి చిత్తోడ్ ఘడ్ సంస్థనాధిపతి కూతురు మీరాబాయి శిష్యరికం చేయడం మనువాద రాజులకి నచ్చక కపట ప్రేమతో సంతు రవిదాసు ని చిత్తోడ్ గడ్ సంస్థానానికి పిలిపించుకొని విషపు భోజనం పెట్టి ముక్కలు ముక్కలుగా నరికి చంపి నడివీధిలో పడేశారు. ఈ సత్యాన్ని బయటకి వ్యాప్తి చెందకుండా దేవుడు ఎక్కడున్నాడు సంతు రవిదాస్ అని ప్రశ్నిస్తే దేవుడు నా గుండెల్లో నా శరీరంలోనే ఉన్నాడని చెప్పి ఖడ్గంతో పొడుచుకొని నా గుండెల్లో దేవుడున్నాడు చూడండి అని చెప్తూ మరణించాడని కట్టు కథని అల్లారు మనువాద చిత్తొడ్గడ్ అగ్రకుల రాజ్యాధిపతులు. సిక్కు మత స్థాపకుడు గురునానక్ కె జ్ఞానాన్ని ఇచ్చినవాడు సంతు రవిదాస్ వారి బోధనలు చమార్ సిక్కు మతస్థులు నేటికీ అనుసరిస్తున్నా.సిక్కు మత ఆదిగ్రంథం లో రవిదాస్ యొక్క 41 కీర్తనలు చేర్చబడినవి.

సంతు రవిదాస్ మహారాజ్ యొక్క జ్ఞాన గొప్పతనం గురించి తెలుసుకొని తన తొలి గురువుగా ప్రకటించుకొని డా.అంబేద్కర్ తన గ్రంథాలను వారికి అంకితం చేశాడు.నేడు సంతు రవిదాస్ గురు రవిదాస్ గా, జగత్ గురు రవిదాస్ గా, నిజమైన సమతా మూర్తిగా అనేక బిరుదులతో కీర్తించబడుతూ భారదేశం లొనే కాదు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో సంతు రవిదాస్ మహారాజ్ కి మందిరాలు ఉన్నాయి.



ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తూ, ఫిబ్రవరి నెల మొత్తం భారతదేశం లోనే కాదు ఇతర దేశాల్లో లక్షలాది గా ఉన్న రవిదాస్ అనుచరులు చాలా ఘనంగా వారి జయంతి ఉత్సవాలని పండగల జరుపుకుంటారు.ఇక అత్యంత ముఖ్య విషయం రవిదాస్ భావాల నుండి పుట్టిన వాడు సంతు కబీర్, కబీర్ భావాల నుండి పుట్టినవాడు శివాజీ, శివాజీ పోరాట స్ఫూర్తి నుండి ఉద్భవించిన వారు జ్యోతిరావు పూలే, అంబేద్కర్ కాన్షీరాం లు. కాన్షీరాం తను బహుజన సమాజ్ పార్టీ ని పెట్టడానికంటే ముందు దాదాపు 15 ఏళ్లపాటు చేసిన సామాజిక సాంస్కృతిక ఉద్యమంలో భాగంగా పూలే అంబేద్కర్ సాహు మహారాజ్ సిద్ధాంతానికి సంతు రవిదాస్ బోధనలని జోడించి ఉత్తరప్రదేశ్ కేంద్రంగా ఉత్తర భారత మొత్తంలో ఎన్నో రాజకీయ విజయాలు సాధించడానికి కానీరాం కి ప్రత్యక్షంగా ప్రభావం చూపిన వారు సంతు రవిదాస్ మహారాజ్.

కాన్షీరాం తర్వాత వారి సిద్ధాంతాన్ని తన భుజస్కందాలపై వేసుకొని ధర్మ సమాజ్ పార్టీ(డిఎస్పి) వేదికగా డా. విశారదన్ మహారాజ్ గత 15 సంవత్సరాలుగా తెలంగాణ కేంద్రంగా, దక్షిణ భారతదేశంలో పూలే అంబేద్కర్ కాన్షీరాం ల ఉద్యమాన్ని పునర్జీవింప చేసి ముందుకు కొనసాగిస్తున్నరు. సంతు రవిదాస్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో భాగంగా బీసీ ఎస్సి ఎస్టీ అగ్రకుల ప్రజాస్వామ్య వాదులని జాగృత పరుస్తూ ప్రతి సంవత్సరం కూడా డిఎస్పీ నాయకులు, కార్యకర్తల చేత సంతు రవిదాస్ జన్మదిన వేడుకలని తెలంగాణలో ఒక అద్భుతమైన మహత్తర పండుగల చేయిస్తూ, కాన్షీరాం పోరాట స్ఫూర్తిని విశారదన్ మహారాజ్ ముందుకు నడిపిస్తున్నారు. సంతు రవిదాస్ ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రేరణగా తీసుకొని నాడు కాన్షీరాం ఉత్తర భారతంలో బహుజన సమాజానికి అగ్రకుల పాలిత వర్గాలైన జాట్, ఠాగూర్ లని రాజకీయ ప్రత్యర్థులుగా చూయిస్తూ బహుజన రాజ్యాధికారన్ని సాధించారు.కాన్షీరాం వలె డా. విశారదన్ మహారాజ్ తెలంగాణ రాష్ట్రంలో గత 15 సంవత్సరాలుగా తొలి దశలో దళిత్ శక్తి ప్రోగ్రాం పేరుతో బలమైన సామాజిక సాంస్కృతిక ఉద్యమంతో మాదిగల నామ రూప గుణాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి, మాదిగలు ఆత్మ న్యూనతభావంతో జీవించకుండా, జంబూద్వీప ఘన రాజ్య పాలకులైన ఆది జాంబవంతుడి స్ఫూర్తితో మహారాజులుగా జీవించాలని విశారదన్ మహారాజ్ మాదిగల కేంద్రంగా పీడిత కులాల అందరికీ ఆదర్శవంతమైన సామాజిక సాంస్కృతిక విప్లవాన్ని సృష్టించారు. అందులో భాగంగానే సంతు రవిదాస్ మహారాజ్, కాన్షీరాం ల పోరాట స్ఫూర్తితో తాజాగా బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ వేదికను విశారదన్ మహారాజ్ నిర్మించి తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారన్ని సాధించడానికి అలుపెరగని పోరాటం చేస్తున్నారనే చారిత్రక సత్యాన్ని, నేటి సమకాలీన మేధావులు విద్యావంతులు సామాన్యులు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.

**పుల్లెంల గణేష్ (సోషల్, పొలిటికల్ ఏనాలిస్ట్)**
**9553041549**

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఆదివారం అనుబంధం
1.2.2026

ఒక సినిమాని రీమేక్ చేయాలంటే అందులోనూ ఓటీటీలకి ఆడియన్స్ బాగా అలవాటు పడిపోయిన ఈ సమయంలో చేయడం అంటే సాహసమనే చెప్పాలి. పైగా తెలుగు ప్రేక్షకులు ఏదైనా మలయాళం సినిమా బావుందని తెలిస్తే వెంటనే దాన్ని చూసేవరకూ వదిలిపెట్టరు. అలా కొన్నేళ్ల క్రితమే తెలుగు ప్రేక్షకులు బాగా చూసేసిన మలయాళ సినిమా జయ జయ జయ జయహేని ఓం శాంతి శాంతి శాంతిః పేరుతో రీమేక్ చేశారు. తరుణ్ భాస్కర్–ఈషా రెబ్బా జంటగా నటించిన ఈ సినిమా ఎలా ఉంది? తరుణ్ తనలోని యాక్టింగ్ టాలెంట్‌ని చూపించడానికి ఈ సినిమా ఏ మేరకు ఉపయోగపడింది..? ఆ రీమేక్ ఛాయలు కనపడకుండా సినిమాని ఎంతవరకూ ఆడియన్స్‌కి కనెక్ట్ చేయగలిగారు అనేది చూద్దాం.

అవును ఇది రీమేక్ సినిమానే.. కానీ ఇందులో గోదావరి పరిసర ప్రాంతాల్లోని ఆ భాష, యాస, అందాలు అన్నీ చాలా బాగా కనిపిస్తాయి. ఈ మధ్య కాలంలో ఆ ప్రాంతాన్ని ఇందులో చూపించినంత అందంగా ఎందులోనూ చూపించలేదని నేను అనుకుంటున్నా.. ఖచ్చితంగా మేము పెట్టిన కృషి ఆడియన్స్‌కి నచ్చుతుంది.. అంటూ సినిమ రిలీజ్‌కి ముందే తరుణ్ భాస్కర్ నిజాయితీగా ఈ విషయాన్ని చెప్పారు. అంటే అవును ఇది రీమేక్ సినిమానే.. కథ మీకు తెలిసిందే ఉంటుంది.. కానీ మన నేటివిటీకి తగ్గట్లుగా.. మేము ఎలా చేశాము అనేదే ఇక్కడ మేటర్ అనేది తరుణ్ చెప్పిన మాటలకి అంతరార్థం కావచ్చు. ఆ లైన్‌లో మన రివ్యూ కూడా చూద్దా ం మరి.

**కథలో ఏం మార్పు లేదు**

చిన్నప్పటి నుంచి ఇంట్లో వాళ్ల ఇష్టాలపైనే ప్రతి పని చేస్తూ.. తన ఇష్టాల్ని ఎవరూ పట్టించుకోరేంటి అనే బాధతో బతుకుతూ ఉంటుంది ప్రశాంతి (ఈషా రెబ్బా). ఆటల్లో, చదువుల్లో చివరికి పెళ్లిలో కూడా పెద్దవాళ్లు చెప్పిన మాటే వినాల్సి వస్తుంది. కనీసం చేసుకునేవాడైనా తనని అర్థం చేసుకుంటాడు.. తన ఇష్టాలకి గౌరవం ఇస్తాడని అనుకుంటుంది. కానీ తను చేసుకున్న ఓంకార్ నాయుడు (తరుణ్ భాస్కర్) పెద్ద కోపిష్టి.. ముక్కు మీద కోపం ఉన్న మనిషి.. మగాడు అనే అహంకారంతో బతుకుతున్న వ్యక్తి అని కొద్ది రోజుల్లోనే తెలుసుకుంటుంది. పైగా చిన్నచిన్నవాటికి తన మీద చేయి చేసుకునే సరికి ప్రశాంతి తట్టుకోలేకపోతుంది. ఆ బాధని, కోపాన్ని తన లోపలే దాచుకొని దాచుకొని.. తన భర్తకి అతని దారిలోనే బుద్ధి చెప్తుంది. ఇక తర్వాత ఏం జరిగింది.. ? ఇద్దరి సంసారం ఏమైంది..? ఏంటి అనేది ఒరిజినల్ చూసిన వారికి ఎలాగో తెలుసు.. చూడకపోతే కనుక తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.




**తరుణ్ ఆకలి తీరినట్లే :** పెళ్లి చూపులు లాంటి సినిమాతో బ్లాక్ బస్టర్ కొట్టి ఇండస్ట్రీలో తనకంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకున్న డైరెక్టర్ తరుణ్ భాస్కర్. ఈ విషయం అందరికీ తెలిసిందే. పైగా ఆయన సినిమాల కోసం ఒక సెపరేట్ ఆడియన్స్ కూడా ఎప్పుడూ ఎదురుచూస్తూ ఉంటారు. అలాంటి కుర్ర డైరెక్టర్ ఇలా యాక్టింగ్‌లు అంటూ తనలోని డైరెక్టర్‌ని ఎందుకు తొక్కేసుకుంటున్నాడబ్బా అనేది చాలా మందిలో ఉన్న ప్రశ్న. అయితే ఆ ప్రశ్నలకి నోటితో ఇప్పటివరకూ చాలానే సార్లు తరుణ్ సమాధానమిచ్చాడు. అయితే ఈసారి మాత్రం నటనతో సమాధానమిచ్చాడు. అవును ఒక హిట్ సినిమాలోని పాత్ర చేయాలంటే పైగా అందులో ఒక రిజిస్టర్ అయిన నటుడు చేసిన అదే పాత్ర మళ్లీ చేయాలంటే గట్స్ ఉండాలి. జయ జయ జయహే సినిమాలో బాసిల్ జోసెఫ్ చేసిన పాత్రని ఇందులో ఓంకార్ నాయుడుగా తరుణ్ చేశారు. బాసిల్ అందులో పండించిన కామెడీకి ఇందులో తరుణ్ చేసిన ఎంటర్‌టైన్‌మెంట్ ఎక్కడా కంపేర్ చేయకుండా ఆడియన్స్ నవ్వుకునేలా చేయడంలో తరుణ్ సక్సెస్ అయ్యారు.

ముఖ్యంగా కామెడీ సీన్లలో, కాస్త నెగెటివ్ షేడ్ ఉన్న సీన్లలో తరుణ్ నటన చాలా బావుంది. ఆయన నటుడిగా ఇప్పటివరకూ చేసిన సినిమాల్లో ఖచ్చితంగా ఇది అయితే మార్క్ చూపించింది. అలానే గోదారి యాసని కూడా తరుణ్ బాగా వంటపట్టించుకున్నారు. ఇక ప్రశాంతి పాత్రలో ఈషా రెబ్బా కూడా చాలా రోజుల తర్వాత మంచి నటన కనబరిచారు. నిజానికి ఈషాకి సరైన పాత్రలు దొరికిన సందర్భాలు చాలా తక్కువ.

తనలోని నటనని బయటపెట్టే పాత్ర దొరకడంతో ఈషా కూడా అది స్క్రీన్ మీద చూపించారు. ముఖ్యంగా యాక్షన్ సీన్లలో ఈషా అదరగొట్టారు. అలానే ఫస్టాఫ్ మొత్తం పెర్ఫామెన్స్ చాలా సెటిల్డ్‌గా ఉన్నా ఇంటర్వెల్ నుంచి మాత్రం ఈషానే సినిమాని నడిపించారు. ఈషా బాదడం.. తరుణ్ కామెడీగా బాధపడటం.. ఇలా సెకండాఫ్ కూడా బాగానే నడిచిపోయింది. ఇక క్లైమాక్స్‌లో బ్రహ్మానందం ఎంట్రీతో సినిమాకి నీటిగా శుభం కార్డు వేశారు.

ఒరిజినల్ వెర్షన్‌లోని కథని ఏమాత్రం మార్చకపోయినా కూడా తెలుగు ప్రేక్షకులకి తగ్గట్లుగా ముఖ్యంగా గోదారి యాస, భాష, వెటకారాలతో సినిమాని బాగానే ఫ్రెష్‌గా చూపించారు. ఆ ఒరిజినల్ ఛాయలు అక్కడక్కడా కనిపించినా తరుణ్, ఈషా యాక్టింగ్ కారణంగా చూస్తున్న ప్రేక్షకుడు అది మర్చిపోయి దీనికి కనెక్ట్ కాగలిగాడు. కానీ ఇది రీమేక్ కాకుండ ఫ్రెష్ సబ్జెక్ట్ అయి ఉంటే మాత్రం ఖచ్చితంగా తరుణ్–ఈషా హిట్ కొట్టినట్లే అనే మాట ఆడియన్స్ నోట వినిపించేది. అయినా కానీ తమ పాత్రలకి పూర్తి న్యాయం చేశారు.

ఇక సినిమాలో మొదటి నుంచి చివరి వరకూ కనిపించిన ప్రతిసారి హీరో మామ పాత్రలో బ్రహ్మీజీ బాగా నవ్వించారు. చాన్నాళ్ల తర్వాత బ్రహ్మీజీకి ఇలా మంచి కామెడీ ట్రాక్ పడింది. ఇక హీరోయిన్ మావయ్యగా చేసిన వ్యక్తి కూడా అక్కడక్కడా బాగానే నవ్వించారు. మిగిలినవారంతా తమ పాత్రలకి ఎక్కడా అన్యాయం చేయలేదు. ఇది రీమేక్ కాదనే భావన కలగడానికి మ్యూజిక్ కూడా ఒక కారణం. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఫ్రెష్ ఫీల్ ఇచ్చింది. అయితే ఒరిజినల్ చూసినవాళ్లకి కథ తెలియడంతో ఆ ఎక్సైట్‌మెంట్ అంత ఉండదు. కానీ కొత్తగా చూసేవారికి మాత్రం నచ్చుతుంది.




'దేవగుడి' కథ ఒక గ్రామం చుట్టూ, ఆ గ్రామ ప్రజల జీవన విధానం, దేవాలయంతో ఉన్న అనుబంధం ఆధారంగా సాగుతుంది. ఊరిలోని పవిత్రతను, ఐక్యతను ధ్వంసం చేయాలనుకునే శక్తుల నుంచి గ్రామాన్ని కాపాడే యువకుడి పోరాటమే కథ యొక్క కేంద్ర బిందువు. దేవాలయం కేవలం ఆరాధన స్థలంగా కాకుండా, ఊరి ఆత్మగా చూపించడంలో దర్శకుడు విజయం సాధించారు. కథ కొత్తదేమీ కాకపోయినా, దాన్ని చెప్పిన విధానం కొంతవరకు ఆసక్తిని కలిగిస్తుంది.

–: ఇట్స్ అఫీషియల్.. ధనుష్ సినిమాలో శ్రీలీల..ఇక టాలీవుడ్ కు గుడ్ బై చెప్పినట్టేనా?

**నటీనటులు..**

హీరోగా అభినవ శౌర్య తన పాత్రకు న్యాయం చేయడానికి ప్రయత్నించాడు. యాక్షన్ సన్నివేశాల్లో అతని ప్రదర్శన బాగున్నా, ఎమోషనల్ సీన్లలో ఇంకా మెరుగుదల అవసరం అనిపిస్తుంది. అనుశ్రీ పాత్ర కథకు బలంగా ముడిపడి ఉంటుంది. ఆమె నటన సహజంగా అనిపిస్తుంది. నరసింహ తన పాత్ర పరిధిలో సంతృప్తికరంగా నటించాడు. ఇక సినిమాకు ప్రధాన బలం రఘు కుంచె. నటుడిగా ఆయన ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ఆయన పాత్రకు వచ్చిన స్క్రీన్ ప్రెజెన్స్ కథకు మంచి ఎలివేషన్ ఇచ్చింది.

**సాంకేతిక అంశాలు**

దర్శకుడు గ్రామీణ వాతావరణాన్ని సహజంగా చూపించడంలో శ్రద్ధ పెట్టారు. కొన్ని చోట్ల కథనం నెమ్మదిగా సాగినా, క్లైమాక్స్ మాత్రం భావోద్వేగంగా నిలుస్తుంది. సంగీతం పరంగా పాటలు సాధారణంగా ఉన్నా, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కీలక సన్నివేశాల్లో బాగా వర్క్ అయింది. సినిమాటోగ్రఫీ సహజత్వాన్ని ప్రతిబింబిస్తుంది. పరిమిత బడ్జెట్ ఉన్నా, నిర్మాణ విలువల్లో రాజీ పడలేదు.

**ప్లస్ పాయింట్స్ :** రఘు కుంచె, క్లైమాక్స్‌లో ఎమోషన్, కథనం
**మైనస్ పాయింట్స్ :** స్క్రీన్‌ప్లే , కొత్త నటీనటులు

హీరోయిన్ భూమి పెడ్నేకర్ లేడి ఓరియెంటెడ్ సిరీస్ లకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. గత సంవత్సరం "భక్షక్" వంటి క్రైమ్ థ్రిల్లర్ తో ఆకట్టుకున్న ఈ బ్యూటీ ఇప్పుడు "దల్దల్" అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. "భిండి బజార్" పుస్తకం నుండి ప్రేరణ పొందిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్ కు దర్శకుడు అమృత్‌రాజ్ గుప్తా దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులోకి వచ్చింది. మరి ఈ సిరీస్ అంచనాలను అందుకుందా ? అనేది రివ్యూలో తెలుసుకుందాం పదండి.

**కథ**

ముంబై క్రైమ్ బ్రాంచ్ రీటా ఫెర్రీరా (భూమి పెడ్నేకర్), ఓ కేసు నిమిత్తం ఎనిమిది వారాల పాటు ముంబైలోని రెడ్ లైట్ ప్రాంతంలో టీచర్ గా నటిస్తుంది. అక్కడ పిల్లల అక్రమ రవాణాకు సంబంధించిన ముఠాను పట్టుకుంటుంది. ఈ ఆపరేషన్ సక్సెస్ కావడంతో రీటాకు ప్రమోషన్ లభిస్తుంది. బాల్యం నుంచి రీటా జీవితం కష్టాల్లోనే నడిచింది. ఇక ఇప్పుడు కూడా ప్రియుడి నుండి కూడా విడిపోవాలని కోరుకుంటుంది. ఇలా పర్సనల్ లైఫ్ లో స్ట్రగుల్ అవుతున్న ఆమెకు ప్రమోషన్ గురించిన ఓ షాకింగ్ విషయం తెలుస్తుంది. ఇంతలో ముంబైలో వరుస హత్యలు ప్రారంభమవుతాయి. కేసును పరిష్కరించే బాధ్యత రీటాపై పడుతుంది. ఈ కేసును ఎలాగైనా కొలిక్కి తేవాలని, తనను తాను నిరూపించుకోవాలని ఆమె అనుకుంటుంది. ఇంతలో కథ డ్రగ్స్ కి బానిస అయిన సాజిద్ (ఆదిత్య రావల్), అతని స్నేహితురాలు అనిత చుట్టూ తిరుగుతుంది. ప్రమాదకరమైన సీరియల్ కిల్లర్ ఉచ్చులో కూడా రీటా పడుతుంది. చివరికి రీటా కిల్లర్ ను పట్టుకోగలదా? ఆమె తన ప్రేమను నిలబెట్టుకుంటుందా ? తనను తాను నిరూపించుకోగలదా? సాజిద్, అనిత పాత్రలు ఇందులో ఎలాంటి మలుపులు తెస్తాయి ? అనే విషయాల చుట్టూ ఈ సిరీస్ మిగతా కథ నడుస్తుంది.

**విశ్లేషణ**

ఈ సిరీస్ లో కథ మూడు భాగాలుగా నడుస్తుంది. మొదటి భాగంలో కథ పిల్లల అక్రమ రవాణా గురించి, రెండవ భాగంలో వరుస హత్యలపై ఆధారపడి ఉంటుంది. చివరలో పాత్రల గత గాయాల గురించి ఉంటుంది. ఏడు ఎపిసోడ్‌ల ఈ సిరీస్ క్లైమాక్స్ వరకు వివిధ పాత్రల ఎంట్రీతో కన్ఫ్యూజ్ గా సాగుతుంది. సిరీస్‌లో ప్రతి ఎపిసోడ్ లో ఆసక్తిని పెంచే ట్విస్ట్ వస్తూ ఉంటుంది. అయితే నిజమైన హంతకుడు ఎవరు ? అనే విషయమై ఆడియన్స్ ను కన్ఫ్యూజ్ చేయడానికి దర్శకుడు చాలాసార్లు ప్రయత్నించాడు. మొదటి రెండు ఎపిసోడ్లలోనే కథను చెప్పేశారు. తరువాత ఏం జరుగుతుందనే విషయం తెలుసుకోవడానికి మిగతా ఎపిసోడ్స్ చూడాల్సి ఉంటుంది. అక్కడక్కడా సాగదీసిన ఫీలింగ్ వస్తుంది. ప్రీ–క్లైమాక్స్ అతిగా అన్పిస్తుంది. చివరికి వచ్చే కొద్దీ చాలా బలహీనంగా మారుతుంది.

ఈ సిరీస్ ప్రధాన బలం కథనం. సినిమాటోగ్రఫీ, నేపథ్య సంగీతం బాగున్నాయి. అయితే చాలా సన్నివేశాల్లో ముఖాలను కూడా స్పష్టంగా చూపించలేకపోయారు. ఎడిటింగ్ లో కత్తెరకు మరింత పదును పెట్టాల్సింది. నటన పరంగా అందరు తమ బెస్ట్ ఇచ్చారు. లేడీ పోలీస్ ఆఫీసర్ గా భూమి పెడ్నేకర్ ఆకట్టుకుంటుంది. ఆదిత్య రావల్ మాదకద్రవ్యాల బానిసగా, ఆత్మహత్య చేసుకునే షాహిద్ పాత్రను అద్భుతంగా పోషించారు. సమర తిజోరి తన పాత్రకు అన్ని విధాలుగా న్యాయం చేసింది. గీతా అగర్వాల్ తన నటనతో సినిమాకు ప్లస్ పాయింట్ అయ్యింది. సపోర్టింగ్ యాక్టర్స్ కూడా అద్భుతంగా నటించారు. .




ప్లస్ పాయింట్స్ం కొన్ని క్రైమ్ సీన్స్ ఆడియన్స్ లో భయం పుట్టిస్తాయి. నటన, మ్యూజిక్


**మైనస్ పాయింట్స్ ం** సస్పెన్స్ పెద్దగా లేకపోవడం. సగం సిరీస్ లైటింగ్ సరిగ్గా లేకపోవడం, ఫ్లాష్‌బ్యాక్‌లను పదే పదే చూపించడం, చివరి రెండు ఎపిసోడ్‌లు ల్యాగ్ .

**మొత్తానికి**

వీకెండ్ కొత్తగా చూడటానికి ఏమీ లేకపోతే భూమి పెడ్నేకర్ కోసం ఒకసారి ఈ సిరీస్ ని చూడవచ్చు.

# ద్వాదశరాశి ఫలములు (వార ఫలాలు)

సూర్య
www.suryaa.com
1.2.2026



## 1.2.2026 నుంచి 7.2.2026 వరకు

గమనిక: గోచారఫలాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు

### మేషరాశి

అశ్విని 1,2,3,4 పాదములు - భరణి 1,2,3,4 పాదములు

ప్రారంభంలో గృహ వాహన అంశముల మీద దృష్టి సాధిస్తారు. తల్లి ఆరోగ్యం వృద్ధి. విద్యా విషయాలు చాలా వరకు అనుకూలంగా ఉంటాయి. నూతన అంశాలు నేర్చుకుంటారు. విద్యార్థులకు కొత్త అవకాశాలు, ఆలోచనలు ఆనందాన్ని కలిగిస్తాయి. కమ్యూనికేషన్ అనుకూలంగా ఉంటుంది. నైపుణ్యాలు పెంపొందించుకుంటారు. ఎదురుచూస్తున్న విషయాలలో ఆశించిన ఫలితాలు మానసిక ప్రశాంతను పెంపొందిస్తాయి. వారాంతంలో పోటీ విషయాలను అనుకూలంగా ఉంటాయి. ప్రత్యర్థుల మీద విజయం, అనుకూల ఆరోగ్యం, రుణాలను చెల్లించ గలుగుతారు. ఖర్చులు అధికంగా ఉంటాయి. భాగస్వామ్య వ్యవహారాలు అనుకూలం. కుటుంబ సభ్యులతో కలిసి కొత్త ప్రదేశాలకు వెళ్లడానికి ప్రణాళికలు. స్నేహ సంబంధాలను పెంపొందించుకుంటారు గౌరవం గుర్తింపు కీర్తి పెరుగుతాయి. శివారాధన మేలు.

### వృషభరాశి

కృతిక 2,3,4 పాదములు - రోహిణి 1,2,3,4

ఆత్మీయులైన మిత్రులతో కలిసి నూతన ఆలోచనలు. దగ్గర ప్రయాణాలు. పనికి తగిన ప్రతిఫలాన్ని పొందగలుగుతారు. తండ్రి, పెద్దల యొక్క సహకారం అందుకుంటారు. ఉన్నత విద్య కొరకు చేసే ప్రయత్నాలు, వ్యక్తిగత శ్రద్ధ, దినచర్యలలో మార్పు అనుకూలంగా ఉంటాయి. విదేశీ అవకాశాల కొరకు ప్రయత్నాలు అధికం. ఆధ్యాత్మిక ఆలోచనలు ఆనందాన్ని కలిగిస్తాయి. గృహ వాతావరణం కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. విద్యలో ఆటంకాల్ని అధిగమించే దిశగా ప్రయత్నాలు చేయాలి. వారాంతంలో కమ్యూనికేషన్ అనుకూలం. వృత్తిలో నూతన అవకాశాలు, బాధ్యతలు. దూర ప్రదేశాలలో ఇంటర్వ్యూలు. రోగ నిరోధక శక్తిని పెంపొందించు కోవడానికి చేసే ప్రయత్నాలు, అనుకూలంగా ఉంటాయి. ప్రత్యర్థుల మీద విజయం సాధిస్తారు. వృత్తి చేసే ప్రదేశాలలో అధికారులతో సమస్యల్ని వినయంగా సమన్వయ పరచుకుంటూ సాధించుకోవాలి. ఇష్టదేవత ప్రార్థన మేలు చేస్తుంది.

### మిధునరాశి

మృగశిర 3,4 పాదములు - ఆరుద్ర 1,2,3,4 పాదములు

ప్రారంభంలో కొంతవరకు ఆర్థిక విషయాలు, కుటుంబ సభ్యుల తో వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ, మిత్రులు, ఆత్మీయుల యొక్క సహకారం ఆశించిన స్థాయిలో లభించుటలేదని భావన ఉంటుంది. ఉన్నత స్థాయి వ్యక్తుల యొక్క సహాయంతో చేద్దామనుకుంటున్న కార్యక్రమాలు చిన్నపాటి ఆటంకాలు. కమ్యూనికేషన్ విషయంలో తగిన జాగ్రత్తలు అవసరం. సంతాన ఆరోగ్య శ్రద్ధ తీసుకుంటారు. పెట్టుబడులు పెట్టేటప్పుడు ఆచితూచి వ్యవహరించవలసిన పరిస్థితి. దగ్గర ప్రయాణాలకు అవకాశం. ప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాల విషయంలో తగిన జాగ్రత్తలతో ముందుకు వెళ్లాలి. వారాంతంలో గృహ విషయాలు మీద శ్రద్ధ అధికం చేస్తారు. ఖర్చులు అధికంగా. పెద్దల ఆరోగ్యం మీద శ్రద్ధ. సంతానం అభివృద్ధి. దత్తాత్రేయ ఆరాధన మేలు.

### కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము - పుష్యమి 1,2,3,4 పాదములు

ప్రారంభంలో ఆరోగ్యము అనుకూలంగా ఉంటుంది నూతన ఆలోచనలు. వృత్తిపరమైన అభివృద్ధి, సంతానము విషయంలో కొత్త నిర్ణయాలు తీసుకుంటారు, నూతన వ్యక్తుల పరిచయం సంఘంలో గుర్తింపు గౌరవం సామాన్యం. మాటల వల్ల కుటుంబ సభ్యులతో ఘర్షణ రాకుండా తగిన జాగ్రత్తలతో ముందుకు వెళ్లాలి. ఆర్థిక విషయాల్లో అనుకూలత మిశ్రమం. కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణాలకు అవకాశం, ముఖ్యంగా ఆధ్యాత్మిక ప్రదేశాలు సందర్శించే పరిస్థితులు. గృహంలో పుణ్యప్రదమైన దైవిక కార్యక్రమాలు. వారాంతంలో కమ్యూనికేషన్ అనుకూలంగా ఉంటుంది, కుటుంబంలో ఖర్చులు అధికమైనప్పటికీ గృహ వాహన విషయాలు అనుకూలిస్తాయి. విద్యా విషయాలలో ఆశించిన ఫలితాలు. ఉన్నత స్థాయి వ్యక్తులకు సహకారం ఆనందాన్నిస్తుంది. మంచి గురువులభ్యం.

### సింహరాశి

మఖ 1,2,3,4 పాదములు - పుబ్బ 1,2,3,4

వారం ప్రారంభంలో నిద్రలేమి అలసట పని ఒత్తిడి అధికముగా ఉంటాయి. సమయానికి ఆహార స్వీకరణ అవసరం. అనవసరమైన ఖర్చులను అధిగమించాలి. ప్రత్యర్థుల మీద విజయం సాధించడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తారు. రోగ నిరోధక శక్తి అనుకూలం,ఆశించిన వ్యక్తుల యొక్క సహకారం ఆనందాన్నిస్తుంది. నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి కోపాన్ని నియంత్రించుకోవాలి. ఆరోగ్యం మీద శ్రద్ధ అవసరం. మాటలు వల్ల అపార్థాలు ఎదురయ్యే అవకాశం ఉన్న రీత్యా, వాగ్దానాల విషయంలో, కుటుంబ సభ్యులతో మాట్లాడేటప్పుడు, ఆర్థిక సంబంధ అంశాలలో తగిన జాగ్రత్తలతో ముందుకు వెళ్లాలి. ముఖ్యమైన విషయాలలో ఆలస్యాలు చికాకును కలిగిస్తాయి. సాంఘిక సంబంధాల్లో తగు జాగ్రత్తలతో శ్రద్ధ తీసుకోవాలి. వారాంతంలో శక్తి సామర్థ్యాలు ఉపయోగించి అనుకున్న పనిని అనుకున్న సమయంలో పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తారు. తోబుట్టులతో ఘర్షణలకు దూరం అవసరం

### కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు - హస్త 1,2,3,4 పాదములు

ప్రారంభంలో ఆర్థిక విషయాలలో అనుకూలం, ఎదురుచూస్తున్న వర్తమానాలు అందుకుంటారు. తోబుట్టువులతో అభిప్రాయ బేధాలు అధిగమిస్తారు. పెట్టుబడుల కొరకు ప్రయత్నాలు. ఆత్మీయులను సంప్రదించి ముందుకు వెళ్లడం మేలు. భాగస్వామ్య వ్యవహారాలలో ఆచితూచి నిర్ణయాలు అవసరం. దీర్ఘకాలికి పెట్టుబడులు ఆలోచనలు.దూర ప్రయాణాలు, నిద్రలేమి, అనవసర ఖర్చులు ఇబ్బంది కలిగిస్తున్నప్పటికీ సమయస్ఫూర్తిగా నిర్ణయాలు తీసుకుంటారు. బంధువులతో చర్చలు నిదానం అవసరం. గవర్నమెంట్ పనులు అధిక శ్రమతో ముందుకు వెళతాయి. సంతానం అభివృద్ధి కొరకు, వారి విద్యా నిమిత్తం కొత్త ఆలోచనలు చేస్తారు. వారాంతంలో కమ్యూనికేషన్ అనుకూలంగా ఉంటుంది, వృత్తిలో అభివృద్ధి. శ్రమకి తగిన గుర్తింపు గౌరవం, పోటీలలో నెగ్గుతారు, నూతన అవకాశాలు. విష్ణుమూర్తి ఆరాధన మేలు.

### తులారాశి

చిత్త 3,4 పాదములు - స్వాతి 1,2,3,4 పాదములు

వృత్తిపరైన విషయాలలో అధిక శ్రమతో, గుర్తింపు గౌరవం కోసం ముందుకు వెళతారు. కుటుంబ సభ్యుల యొక్క సహకారం సామాన్యం. విద్యార్థులకు విద్యాపరమైన విషయాలలో శ్రద్ధ అవసరం. గృహ వాతావరణం మీద ప్రత్యేక శ్రద్ధ. ఆర్థిక విషయాలలో అభివృద్ధి, దూర దేశాల నుంచి వర్తమానాలు, సంతాన విషయంలో కీలక నిర్ణయాలు. వ్యాపార విషయాలలో కొత్త మార్పులలో తొందరపడి నిర్ణయాలు పనికిరావు. కంటి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. దీర్ఘకాలికి పెట్టుబడుల విషయంలో నూతన వ్యక్తుల పరిచయం. వారాంతంలో సంతానం, వారి అభివృద్ధి కొరకు ధనాన్ని ఖర్చు చేస్తారు. ప్రయాణాలకు అవకాశం అధికం. కుటుంబ సభ్యులతో కలిసి విందు వినోదాల్లో, షాపింగ్ లో పాల్గొంటారు. సూర్యనారాయణ స్వామి ఆరాధన మంచి ఫలితాలు ఇస్తుంది.

### వృశ్చిక రాశి

విశాఖ 4వ పాదము - అనురాధ 1,2,3,4

ప్రారంభంలో ఆధ్యాత్మిక ఆలోచనలు అధికంగా ఉంటాయి తండ్రి ఆరోగ్యం అనుకూలంగా ఉంటుంది శ్రమకి తగిన గుర్తింపు గౌరవం లభిస్తుంది, ఆధ్యాత్మిక ప్రయాణాలకు అవకాశం. క్రింద సిబ్బంది సహకారంతో అనుకున్న సమయంలో అనుకున్న పనులు పూర్తి చేస్తారు. వృత్తిపరమైన విషయాలలో వ్యక్తుల సహకారం ధైర్యాన్ని నమ్మకాన్ని పెంపొందిస్తుంది. ఎదురుచూస్తున్న విషయాలలో ఒక వార్త ఆనందాన్నిస్తుంది. స్నేహితులతో చర్చలు నూతన నిర్ణయాలు, వారసత్వపు ఆస్తులు విషయంలో మార్పులు, వారాంతంలో శ్రమ అధికంగా ఉంటుంది, స్థిరాస్తులు విషయంలో నిర్ణయాలు తీసుకుంటారు. నూతన వాహనాలు, గృహ సంబంధ మార్పులు ప్రశాంతతను ఇస్తాయి. డ్రైవింగ్ చేసేవారు తగిన జాగ్రత్తలతో ఉండాలి. మరిన్ని మంచి ఫలితాలు కొరకు శ్రీకృష్ణ మందిరాలు దర్శించడం మేలు.

### ధనస్సు రాశి

మూలా 1,2,3,4 పాదములు - పూర్వాషాడ 1,2,3,4 పాదములు - ఉత్తరాషాడ 1వ

వారం ప్రారంభంలో ఆర్థిక కుటుంబ వ్యవహారాలలో ఆకస్మిక ఖర్చులు. వాగ్వాదాలకి దూరంగా ఉండాలి. సంతానంతో చర్చించేటప్పుడు వారి అభివృద్ధి విషయంలో, స్నేహ సంబంధాల విషయంలో శ్రద్ధ తీసుకుంటారు. దూర ప్రయాణాలకు అవకాశం. ఉన్నత విద్య కొరకు రుణ ప్రయత్నాలు. తండ్రి యొక్క ఆరోగ్య విషయంలో శ్రద్ధ. వృత్తి విషయాలలో ఇతరుల జోక్యం ప్రశాంతతను తగ్గిస్తుంది. గృహ నిర్మాణ అంశాలలో ఆలస్యాలు ఉన్నప్పటికీ కొంతమేర ముందుకు వెళతారు. వారాంతంలో వృత్తి, భాగస్వామ్య వ్యవహారాలలో కమ్యూనికేషన్ విషయంలో నిదానం అవసరం. ఎదురుచూస్తున్న వర్తమానాలు ఆనందాన్ని కలిగిస్తాయి. చిన్ననాటి మిత్రులతో, చర్చలు, సమావేశాలు. ఆర్థిక విషయాలు అనుకూలం. హనుమాన్ మందిరాలు దర్శనం మేలు.

### మకరరాశి

ఉత్తరాషాడ 2,3,4 పాదములు - శ్రవణం 1,2,3,4 పాదములు

ప్రారంభంలో గౌరవం, గుర్తింపు. నూతన స్నేహ సంబంధాలలో, భాగస్వామ్య వ్యవహారాలు, నిర్ణయాలు శ్రమతో ఉంటాయి. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకుంటారు. దూర ప్రదేశాలలో స్థిరాస్తులు అంశంలో పెట్టుబడుల కొరకు కుటుంబ సభ్యులతో చర్చలు. వ్యాపార విషయంలో మిశ్రమం. ఉన్నత స్థాయి వ్యక్తులతో సహకారం కొరకు ప్రయత్నించేటప్పుడు జాగ్రత్తలు అవసరం, అభిప్రాయ బేధాలకు దూరంగా ఉండాలి. మానసిక ప్రశాంతత విషయంలో మెడిటేషన్ మంచిది. వాహనము నడప వారు తగిన జాగ్రత్తలు అవసరం. శ్రమకి తగిన ఫలితం విషయంలో మిశ్రమ ఫలితాలు. కుటుంబంలో పెద్దల ఆరోగ్యం, ఉన్నత విద్య విషయంలో సామాన్యం. వారాంతంలో వృత్తిపరంగా అభివృద్ధి నూతన అవకాశాలు. ఆలోచనలు ఫలిస్తాయి. అమ్మవారి ఆరాధన మేలు

### కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు - శతభిషం 1,2,3,4

ప్రారంభంలో శ్రమతో, అధిక కృషితో వృత్తిపరమైన అభివృద్ధి కొరకు ప్రయత్నాలు, ప్రత్యర్థుల మీద విజయం సాధిస్తారు. వృత్తి చేసే ప్రదేశాలలో కొలీగ్స్ తో, అధికారులతో ఘర్షణలకు దూరంగా ఉండడం మేలు. అసంతృప్తిని అధిగమించాలి. భాగస్వామ్య వ్యవహారాలలో, స్నేహ సంబంధాలను నిలబెట్టుకునే అంశాల్లో అధిక ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలని కొంతవరకు నియంత్రించుకుంటూ ముందుకు వెళ్లాలి. జీవిత భాగస్వామికి సహకరించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఆర్థిక విషయాలలో, వాగ్దానాలలో నిలబెట్టుకొనుటకు ఆచితూచి వ్యవహరించాలి. ముఖ్యమైన విషయాల్లో ఆలస్యాలు ఆటంకాలు ప్రశాంతతను తగ్గిస్తాయి. వారాంతంలో తల్లిదండ్రుల సహకారం అనుకూలంగా ఉంటుంది, ఉన్నత విద్య, మానసిక తృప్తి. వాహన సౌఖ్యం. నిద్రలేమిని అధిగమించాలి. వెంకటేశ్వర స్వామి ఆరాధన మేలు.

### మీన రాశి

పూర్వాభాద్ర 4వ పాదము - ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు - రేవతి


ప్రారంభంలో ఆర్థిక నిర్ణయాలు, సంతానవర్గంతో అనుకూల వాతావరణం. ఆశించిన విషయాలను ఫలిస్తాయి. మానసిక ప్రశాంతత. ఉన్నత స్థాయి వ్యక్తులు, తండ్రి గారి సహకారం, ఉన్నత విద్యల అభివృద్ధి, దూర ప్రదేశాల్లో ఉండే ఆత్మీయ వ్యక్తుల ఆహ్వానాలు. ఆరోగ్యం అనుకూలం, రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటారు. రుణాలను తీర్చి వేస్తారు. సాంఘిక సంబంధాలు, గుర్తింపు గౌరవం పెరుగుతుంది. ప్రయాణాలకు అవకాశం. వారాంతంలో వ్యాపార భాగస్వామ్య విషయాలలో, ముఖ్యంగా జీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకుంటారు. కమ్యూనికేషన్ విషయంలో ఆలోచించి మాట్లాడాలి. తల్లి, తోబుట్టువులతో చర్చించేటప్పుడు, భూ సంబంధ నిర్ణయాలు తీసుకునేటప్పుడు ముఖ్య విషయాలలో నిదానమవసరం. విదేశీ అవకాశాలు. అలవాట్లను నియంత్రించుకోవాలి.

నిర్వాహణ : స్వర్ణ కంకణ సన్మానిత, జ్యోతిష చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద

డా. ఈడుప్వగంటి పద్మజారాణి

ఎమ్మెస్సీ (గణితం), ఎం.ఏ( జ్యోతిషం గోల్డ్‌మెడల్), ఎం.ఏ (ఫలిత జ్యోతిషం), పిజిడిప్లమో (జ్యోతిర్వైద్యం-గోల్డ్‌మెడల్), పిజిడిప్లమో (ఇంజనీరింగ్ వాస్తు), పిహెచ్.డి (జ్యోతిషం-గోల్డ్‌మెడల్)

9849250852 - 7506976164 - [illegible] (అపాయింట్ మెంట్ ద్వారానే సంప్రదించవలెను)



సూర్య
www.suryaa.com
1.2.2026
ఆదివారం అనుబంధం

